




GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 162 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 గురువారం 11 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్





### 12న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

# పదవీ ప్రమాణం

### రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10(సమయ జ్యోతి):**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టేందుకు ముహూర్తం ఖరారు అయిందని తెలుస్తోంది. ఈనెల 12వ తేదీన సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపరాష్ట్రపతి చేత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు- చురుగ్గా కొనసాగుతున్నాయి. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఆ క్రమంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రంగలోకి దింపారు. అలాగే ప్రతిపక్ష ఇండి కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని బరిలో దింపారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు- రాగా.. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు- పోలయ్యాయి. ఇక బీఆర్ఎస్, బీజేడీ, ఎస్ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేయనున్నట్లు- తెలుస్తోంది.

# జూబ్లీహిల్స్ నుంచే బిఆర్ఎస్ జైత్రయాత్ర

### జమిక్షా సమావేశంలో కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉంటుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీ-ఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు అందరి ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి అని పేర్కొన్నారు. ఓటు-కు రూ.5 వేలు పంచితే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు అనుకుంటు-న్నారని ఎద్దేవా చేశారు.



# హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాలి



అత్యవసరంగా స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం మెహిదీపట్నం వద్ద స్కై వాక్ ప్రాజెక్ట్

రాజీవ్ రహదారిలో ఔటర్ వరకు ఆరులేన్ల విస్తరణ లంగర్‌హౌజ్‌లో గాంధీ సర్కిల్ ఆఫ్

యూనిటీ నిర్మాణం రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక భేటీలో పలు ప్రాజెక్టులపై చర్చ రక్షణశాఖ


భూములు బదిలీ చేయాలని కోరిన సిఎం రేవంత్ చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. కంటోన్మెంట్‌లో రహదారి విస్తరణ, రక్షణశాఖ భూముల బదలాయింపుపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, తెలంగాణలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్యవసరం అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న భూములను రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ముఖ్యంగా, మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణానికి భూమి అవసరమని, దీనివల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మరో ముఖ్యమైన అంశం రాజీవ్ రహదారి విస్తరణను కూడా ప్రస్తావించారు. హైదరాబాద్-కరీంనగర్-రామగుండంలను కలిపే ఈ రహదారిలో, ప్యాకేజీ జంక్షన్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వీటితో పాటు-, తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపైనా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు- సమాచారం. లంగర్‌హౌజ్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 98.20 ఎకరాల రక్షణశాఖ భూములు తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. మూసీ, ఈసీ నదుల సంగమం సమీపంలో 'గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ-' నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిలుస్తుందని పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం నిర్మిస్తామన్నారు. చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ఘాట్లు-, శాంతి విగ్రహం, మ్యూజియం ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం తెలిపారు. సీఎం వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాజ్ నాథ్ సింగ్‌తో జరిగిన ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఇదిలావుంటే అణచివేత, దమనకాండపై చాకలి ఐలమ్మ ధిక్కార పతాకాన్ని ఎగురవేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

# సర్వేపల్లి స్ఫూర్తిని కొనసాగించండి

### రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలిపిన జైరామ్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10(సమయ జ్యోతి):**

దేశ 15వ ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గానూ ఎన్నికైన సి.పి.రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఉపరాష్ట్రపతి నిష్పక్షపాతంగా వ్యవహరించడం ముఖ్యమని పేర్కొంటూ.. మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ చైర్మన్ అయిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ఉదహరించారు. 'ప్రభుత్వ విధానాలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా మరియు స్పష్టంగా విమర్శించడానికి ప్రతిపక్షాలను అనుమతించకపోతే ఆ ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా దిగజారిపోయే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు. 1952 మే16న రాజ్యసభ ప్రారంభం రోజున, ప్రముఖ విద్యావేత్త, తత్వవేత్త, రచయిత, దౌత్యవేత్త ఈవిధంగా అన్నారు. 'నేను ఏ పార్టీకి చెందిన వాడిని కాదు.

# అవినీతి సొమ్మును కక్కిస్తాం

### రాజకీయ కక్షసాధింపులకు తావు లేదు

### మీడియాతో మంత్రి కోమటిరెడ్డి

**నల్గొండ, సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ- కారు రేస్, ధరణిలో దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం... పేదలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. అవినీతి సొమ్మను రాబడతామని అన్నారు. బిఆర్ఎస్ నేతలు అవినీతిలో రాజ్యమేలారని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు.. పక్క రాష్ట్రంలో మాజీ మంత్రులు ఎంపీ, ఎమ్మెల్యేలు అరెస్ట్ అవుతున్నారని తెలిపారు. ఇక్కడ అరెస్టులు లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా ఖూనీ చేసింది ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తాము పాల్పడమని, చట్ట ప్రకారమే అన్ని జరుగుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కమిటీల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని, ఒక్కో కమిటీ- రిపోర్ట్ వచ్చాక దోషులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్ - 1 రేసులో క్యాబినెట్ తీర్మానం లేకుండా విదేశీ కంపెనీలకు ఇవ్వడం.. ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చినట్టు- ఆధారాలు ఉన్నప్పుడు ఎవరు ఆపినా వారి అరెస్టులు ఆగవని ఆయన స్పష్టం చేశారు



# నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ

### తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

**హైదరాబాద్, సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

నేపాల్‌లో అల్లర్లు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అక్కడి పౌరులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి, ఏ తెలంగాణ పౌరుడికి గానీ గాయాలు లేదా అదృశ్యమైనట్లు ఎలాంటి నివేదికలు అందలేదు. అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, అలాగే కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, అక్కడ ఉన్న తమ పౌరుల భద్రతను, అలాగే వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. సహాయం కోసం తెలంగాణ పౌరులు ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చునిసూచించింది. ప్రైవేట్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ లైజన్ హెడ్ వందన. ఫోన్: 91 9871999044. లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ ఫోన్: 91 9643723157.



### మేడారం మహాజాతరకు

# భారీగా ఏర్పాట్లు

### భక్తులకు ఇబ్బంది లేకుండా

### చర్యలు - సీతక్క

**ములుగు, సెప్టెంబర్10(సమయ జ్యోతి):**



మేడారం మహా జాతరకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఇందుకు అసవరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి సీతక్క అన్నారు. మరింత ఘనంగా జాతర నిర్వహించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి సీతక్క మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం అభివృద్ధిని విస్మరించారని, కానీ ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ముందుగానే జాతరకు ప్రణాళికలు సిద్ధం చేసి అభివృద్ధి పనులను స్వయంగా సమీక్షిస్తున్నారని సీతక్క అన్నారు. మేడారం గద్దెల దగ్గర మార్పులు చేస్తున్నట్లు- తెలిపారు. తాము, పూజారులు చేసిన మార్పులపై సీఎం రేవంత్ సంతృప్తి చెందలేదని.. అందుకే ఆయనే స్వయంగా గద్దెల దగ్గరకు వస్తున్నారని వివరించారు. ఈ నెల 13న లేదా 14న సీఎం మేడారం పర్యటనకు వస్తారని తెలిపారు. అయితే, గద్దెల మార్పుపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజారులు, భక్తుల మనో భావాలు దెబ్బతినకుండా మార్పులు చేస్తామన్నారు. మేడారం జాతరపై రాజకీయం చేయవద్దని, భక్తి భావంతో చూడాలని సూచించారు. మహాజాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా మార్పులు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేలా చర్యలు ఉంటాయని అన్నారు.

# పజాస్వామ్యం పట్ల ఆ ఇద్దరికీ గౌరవం లేదు

### మోడీ, అమిత్ షాలపై ఖర్గే విమర్శలు

**గాంధీనగర్, సెప్టెంబర్ 10(సమయ జ్యోతి):**

భారత రాజ్యాంగాన్ని గానీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశం మోడీ, అమిత్‌షాలకు లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలపై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఖర్గే గుజరాత్‌లోని జునాగఢ్‌కి చేరుకున్నారు.



# బిజెపిని నాశనం చేసే కుట్రలు

## రాష్ట్ర కార్యవర్గంలో కిషన్ రెడ్డి అనుచరులు

## పార్టీ పెద్దల ఆశీర్వాదం ఎప్పుడూ తనకే

## ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేది లేదన్న రాజాసింగ్

**హైదరాబాద్,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

బీజేపీని సర్వనాశనం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. అసలైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీలో నా మనిషి, నీ మనిషి అనే రాజకీయం నడుస్తోందని వ్యాఖ్యానించారు. కొత్త కమిటీలో 12 మంది ఒకే పార్లమెంటు సెగ్మెంట్ వాళ్లు ఉన్నారని చెప్పారు రాజాసింగ్. రాష్ట్ర కమిటీని కిషన్ రెడ్డి వేశారా? లేక రామచందర్ రావు వేశారా అని ప్రశ్నించారు. రామచందర్ రావు మంచి వ్యక్తే కానీ..రబ్బర్ స్టాంప్ అని అన్నారు. ఈ ప్లానింగ్ అంతా కిషన్ రెడ్డిదేనని విమర్శించారు. కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే తాను కూడా చేస్తానని అన్నారు. కిషన్ రెడ్డి ఇండిపెండెంట్ గా పోటీ- చేయాలి. నేనూ చేస్తా..ఎవరు గెలుస్తారో చూసుకుందాం అని సవాల్ విసిరారు. రాజాసింగ్ ఎప్పుడైనా ఏక్ నిరంజన్ అని..తన వెనుక ఎవరూ లేరన్నారు .రాజీనామా చేయనని ఏం చేసుకుంటారో చేసుకోండని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చే పార్టీని పండబెట్టారని వ్యాఖ్యానించారు. ఇపుడు ఏ కార్యకర్త పనిచేయడానికి ఇష్టపడటం లేదన్నారు. తనపై పోస్టులు పెట్టిన వ్యక్తి ఎక్కడుంటాడో చూసుకోవాలని హితవు పలికారు. తన గురించి విమర్శించే వాళ్లు వాళ్ల గురించి ఆలోచించుకోవాలని సూచించారు రాజాసింగ్. తన మీద విమర్శలు చేసే అర్హత ప్రధాన కార్యదర్శి అశోక్ కు లేదన్నారు. గతంలో ఏబీవీపీ కార్యకర్తలపై కేసులు పెట్టిచ్చిన చరిత్ర అశోక్ దని చెప్పారు.నెలకు డబ్బులిచ్చి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తల గొంతుకగా తాను మాట్లాడుతున్నానని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే.. నేను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఇద్దరం కలిసి ఎన్నికలకు వెళ్దాం. భాజపా నాకు ఎలాంటి సహకారాలు అందించలేదు. పార్టీలో నేను ఎలాంటి పదవి ఆశించలేదు. ఇప్పుడున్న కమిటీతో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాదు. ఈ కమిటీతో అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా. పార్టీని నాశనం చేస్తున్నదెవరో మరోసారి చెబుతా.దిల్లీ పెద్దలు నాకు తరచూ ఫోన్ చేసి మాట్లాడతారు. నాకు ఎప్పటి నుంచో కేంద్రంలోని పెద్దల ఆశీర్వాదం ఉంది. వాళ్లను కలిసి పార్టీలో జరిగిందంతా చెబుతా. నేను ఎప్పటికీ భాజపా నేతనే. సెక్యులర్ వాదిని కాదు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీల్లో చేరను. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినందుకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఫోన్ చేసి తిట్టారు. నేను చేసే కామెంట్స్ పార్టీపై కాదు.. కొందరు నేతలపై మాత్రమే. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దిల్లీ పెద్దలు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా అని రాజా సింగ్ తెలిపారు.

# అర్ధరాత్రి నుంచే క్యూ లైన్లు

## మిరుదొడ్డలో ఆందోళనకు దిగిన రైతులు

**సిద్దిపేట,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

యూరియా కష్టాలు తప్పడం లేదు. రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. క్యూలో నిల్చోవడానికి రాత్రిళ్లు జాగారం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని మిరుదొడ్డి రైతువేదిక ఎదుట యూరియా కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం వరుసకట్టిన నేపథ్యంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు- చేసుకుంది. అసహనానికి గురైన రైతులు వేదికలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. కేవలం 1120 యూరియా బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. అన్నదాతలు మాత్రం వేల సంఖ్యలో బారులు తీరారు. ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై కీర్తి కుమార్, మిరుదొడ్డి ఎస్సై సమతలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసుల సమక్షంలో భారీ బందోబస్తు మధ్య యూరియాను రైతులకు పంపిణీ చేశారు. 3 వేల మంది టోకెన్లు దొరకక నిరాశతో వెనుతిరిగారు. మెదక్ జిల్లా శివ్వంపేట సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం మంగళవారం రాత్రి అక్కడే పడుకొని వేచిచూశారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం బారులు తీరారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్‌లో యూరియా కోసం రాత్రి నుంచి క్యూలో నిరీక్షించారు.

# ఐశ్వర్య బాటలో అభిషేక్ బచ్చన్

## ఎఐ సాయంతో అశ్లీల కంటెంట్ తయారీ

## ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ బుధవారం దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పబ్లిసిటీ-, పర్సనాలిటీ- హక్కులకు రక్షణ కల్పించాలని న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. కొన్ని వెబ్‌సైట్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుకుంటున్నాయని.. వాటిని ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. కొందరు వ్యక్తులు ఏఐతో అభిషేక్ ఫొటోలు క్రియేట్ చేసి అశ్లీల కంటెంట్‌కు ఉపయోగించుకుంటున్నట్లు- నటుడి తరఫు న్యాయవాది ప్రవీణ్ కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు కోర్టుకు సమర్పించినట్లు- చెప్పారు. ఇక సోషల్ మీడియాలో వైరలవుతోన్న ఏఐ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీలకు తలనొప్పిగా మారాయి. తాజాగా ఇదే విషయంపై అభిషేక్ సతీమణి, నటి ఐశ్వర్యారాయ్ కూడా దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అనుమతి లేకుండా తన ఫొటోలను, పేరును ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని ఆమె కోర్టును కోరారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఐశ్వర్య పేరు, ఫొటోలు ఉపయోగించకుండా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది.

# బిఆర్ నాయుడు రాకతో అన్నీ వివాదాలే

## టిటిడిలో సొంత ఉద్యోగుల పెత్తనం సాగుతోంది

## వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శలు

**తిరుపతి,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

బీఆర్ నాయుడు టీటీడీ ఛైర్మన్ పదవి చేపట్టినప్పటి నుంచి అన్నీ వివాదాలే నెలకొంటున్నాయని.. తప్పులను ప్రశ్నిస్తే వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని మాజీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ నాయుడు ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అనునిత్యం ఏదో ఒకటి అపచారం జరుగుతున్నాయి. ప్రశ్నించి మాపై వ్యక్తిగత దాడికి దిగుతున్నారు. చంద్ర గ్రహణం రోజున మహాద్వారం మూసి వేసిన తర్వాత ఇత్తడి గ్రిల్ గేటు తాళాలు వేస్తున్నారు. బీఆర్ నాయుడు సైన్యంలో ఒకరు తాళం వేస్తున్నారు. ఇది దేనికి సంకేతం.ఇది చాలా తప్పిదం. బోర్డు సభ్యుడు మహాద్వారం వద్ద పెద్ద గొడవ జరిగింది.మీ సైన్యంలో ముఖ్యుడు శ్రీవారి ఆలయంలో కులశేఖర పడి వద్ద ఆలయ డిప్యూటి ఈవో పని చేస్తున్నాడనే ఫిర్యాదులందాయి. టీడీపీ కార్యకర్తగా టివీ5 ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బీఆర్ నాయుడు ఉన్నారనే ధైర్యంతో ఈ బరితెగింపు బయటపడింది. ఆలయం లోపల మరోముఖ్యుడు చేస్తున్న విషయం బయటకు రాలేదు. శ్రీవారి కల్యాణాలు జరపాలని తెలుగు అసోసియేషన్ జర్మనీ వాళ్ళు తరపున రవి కుమార్ వేమూరి కోరారు. సెప్టెంబర్ ఆరు నుంచి 16 చోట్ల శ్రీవారి కల్యాణాలు జరపాలని కోరారు. బీఆర్ నాయుడు తన బలంతో ఒకే చేశారు..ప్రొసీడింగ్స్ ఇచ్చారు. శ్రీవారి కల్యాణాలు మొట్ట మొదటిగా మా హయంలో సూళ్లూరుపేట దళితవాడలో ప్రారంభించాం. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా , ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. శ్రీ శ్రీనివాస కళ్యాణోత్సవాలు హాంబర్గ్‌లో కళ్యాణోత్సవాలుకు టికెట్ ధర 116 యూరోలు , జంటగా కల్యాణోత్సవం 81 యూరోలు, విశేష కళ్యాణానికి 515 యూరోలు పేరుతో టికెట్లు- పెట్టడం జరిగింది. ఎన్నికల ఫండ్స్ ఇచ్చిన వారికి సంపాదించుకోవడానికి అవకాశం ఇచ్చారా.. ధనవంతులు ఇళ్లలో లక్ష్మి పూజలు మీ అనుగ్రహంతోనే జరుగుతున్నాయి.

# వరద ప్రాంతాల్లో సహాయక చర్యలుముమ్మరం

## అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

**హైదరాబాద్,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

ఇటీవల రాష్ట్రంలో ప్రధానంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ఇప్పటివరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయా శాఖల వారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సుల్తానియాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం తగ్గిందని అన్నారు. సహాయక పనులను మరింత వేగవంతం చేయాలని ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయకపోతే వాటిని వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. ఏ ఒక్క బాధితుడు పరిహారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు-, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. సహాయక చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని హైదరాబాద్ నుంచి ఆయా విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యూసీలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమావేశంలో మంత్రిగారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీలోగా ఆయా విభాగాలు యూసీలను సమర్పించాలని ఆదేశించారు. అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజులపాటు- పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, పంచాయితీరాజ్, హెల్త్, మున్సిపల్, ఆర్బి ,విద్యుత్ తదతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు

## సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష

**హైదరాబాద్,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐఅండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్ ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ- తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థికశాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

# నేపల్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కసరత్తు

## మాజీ చీఫ్ జస్టిస్ట్ సుశీలా కర్కికి బాధ్యతలు

### జెన్-జెడ్ ఉద్యమకారులు మొగ్గు

**ఖాట్మండ్,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

కల్లోల నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగున్న నేపథ్యంలో తాత్కాలిక సారథిని ఎన్నుకునేందుకు అక్కడి యువత ముమ్మర చర్చలు జరుపుతోంది. ఈ క్రమంలో మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కి వైపు జెన్-జెడ్ ఉద్యమకారులు మొగ్గుచూపినట్లు- తెలుస్తోంది. తాత్కాలిక సారథిగా బాధ్యతలు స్వీకరించేందుకు ఆమె కూడా సిద్ధంగా ఉన్నట్లు- సమాచారం. అవినీతికి వ్యతిరేకంగా నేపాల్‌లో కొనసాగుతున్న ఉద్యమం హింసాత్మక ఘటనలకు దారితీయడంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో కొత్త సారథిని ఎన్నుకునేందుకు జనరేషన్-జెడ్ ఉద్యమకారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు 5వేల మంది బుధవారం వర్చువల్‌గా సమావేశమై మంతనాలు జరిపారు. కాఠ్‌మాండూ మేయర్ బాలెన్ షాను తొలుత పరిగణనలోకి తీసుకున్నప్పటికీ ఆయన నుంచి స్పందన రాలేదని తెలిసింది. దీంతో మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కి వైపు 'జెన్-జెడ్' ప్రతినిధులు మొగ్గుచూపినట్లు- నేపాల్ మీడియా వెల్లడించింది. బాధ్యతలు స్వీకరించేందుకు కర్కి సిద్ధమైతే.. తొలుత ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్‌తో భేటీ- కావాల్సి ఉంటు-ంది. ఆ తర్వాత అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆమోదం పొందాల్సి ఉంటు-ందని అక్కడి రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సుశీలా కర్కి (72)కి నేపాల్ చరిత్రలో ప్రముఖ స్థానం ఉంది. తొలుత ఉపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత న్యాయవ్యవస్థలో అడుగుపెట్టారు. నిర్భయంగా, సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ అవినీతి మరకలేని వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారు. 2009లో సుప్రీంకోర్టులో అడుగుపెట్టి.. శాశ్వత న్యాయమూర్తిగా నియమితుల య్యారు. 2016లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు చీఫ్ జస్టిస్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టి.. నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. నేపాల్‌లో గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు ముగ్గురు పోలీసులు సహా 25 మంది ప్రాణాలు కోల్పోయినట్లు- అధికారులు వెల్లడించారు. మరో 633 మంది గాయాలపాలైనట్లు- తెలిపారు. ఆందోళనల్లో గాయపడిన నేపాలీ కాంగ్రెస్ చీఫ్, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా, ఆయన భార్య, విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవ్‌బాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరు కోలుకుంటు-న్నట్లు- తెలిసింది. నేపాల్‌లో ఆందోళనలు అదుపులోకి రాకపోవడంతో సైన్యం నిరవధిక కర్ఫ్యూ విధించిన సంగతి తెలిసిందే.

# అనంత సభ సూపర్ సక్సెస్

## వైకాపా దుష్ప్రచారం పనిచేయలేదు

## మంత్రి లోకేశ్ వ్యాఖ్య

**అమరావతి,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

అనంతపురంలో నిర్వహించిన 'సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్' విజయోత్సవ సభపై 'జె గ్యాంగ్' చేసిన వ్యతిరేక ప్రచారం ఏ మాత్రం ప్రభావం చూపించలేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయోత్సవ సభకు వస్తేనే సంక్షేమ పథకాలు ఇస్తామని సమీప గ్రామాల్లో ప్రభుత్వం తరఫున చాటింపు వేయించినట్లు- వైకాపా నాయకులు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కల్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం అచ్చంపల్లిలో వైకాపా నేతలే ఈ కుట్రకు తెరలేపి ఒక వీడియో ప్రచారం చేశారని చెప్పారు. ఈ దుష్ప్రచారంపై వాస్తవాలు ఏంటని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. వైకాపా నేతలు వారి పార్టీకి చెందిన ఓ కార్యకర్తతో దండోరా వేయించి ఆ వీడియోని సోషల్‌మీడియాలో పోస్టు చేసి ప్రచారం చేసినట్లు- వెల్లడైందని మంత్రి తెలిపారు. డ్వాక్రా మహిళలకు సమావేశానికి రాకపోతే జరిమానా విధిస్తారనే తప్పుడు ప్రచారం కోసం ఒక ఆడియోను సోషల్‌మీడియాలో పోస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు చైతన్యవంతులయ్యారని, వైకాపా ఆటలు ఇక సాగవని అన్నారు.

# మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన కొండ ప్రశాంత్ రెడ్డి

**దేవరకద్ర, సెప్టెంబర్ 10 (సమయ జ్యోతి)**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాలలో మృతి చెందిన మృతుల కుటుంబాలను బుధవారం దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. కొత్తకోట పట్టణనికి చెందిన బిజెపి కార్యకర్త ఈశ్వర్ రెడ్డి తండ్రి జనార్ధన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని కొండ ప్రశాంత్ రెడ్డి పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అలాగే ప్రముఖ న్యాయవాది రావుల హేమవర్ధన్ రెడ్డి మాతృమూర్తి దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారి కుటుంబానికి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భరత్ భూషణ్, కొత్తకోట పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,సుబ్బిరెడ్డి వెంకట్రాంరెడ్డి,రాఘవేందర్ రెడ్డి, టీజీ మహేష్, శ్రీకాంత్ రెడ్డి, దాబా శ్రీనివాస్ రెడ్డి,వెంకటేష్. రఘు, బాలుల తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాలలో సాండ్ బజార్ ప్రారంభించిన మంత్రి

**జగిత్యాల సెప్టెంబరు 10 (సమయ జ్యోతి ):**

జగిత్యాల పట్టణంలోని వాణినగర్‌లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం సాండ్ బజార్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరలో, సులభంగా ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ ప్రకారం సాండ్ బజార్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, దీంతో దళారీ వ్యవస్థ, ఇసుక దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని అన్నారు.స్టాక్ పాయింట్ల వద్ద రూ.800 చెల్లిస్తే ఇసుక ఇంటికే చేరేలా సదుపాయం కల్పించామని తెలిపారు. అలాగే లారీలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఉదాహరించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, టిజిఎండిసి జనరల్ మేనేజర్ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఆర్డీవో మధుసూదన్, ప్రాజెక్ట్ అధికారి వినయ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# జమాతే ఇస్లామీ ఎక్స్ పోకు రండి

## పోలీసు కమిషనర్ ను ఆహ్వానించిన జమాతే ఇస్లామి నేతలు

**కరీంనగర్, సెప్టెంబర్ 10 (సమయ జ్యోతి ):**

మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాల సందర్భంగా, జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈనెల 19, 20, 21వ తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రం లోని సర్కస్ గ్రౌండ్లో నిర్వహిస్తున్న ఎక్స్ పో-2025కు రావాలని, జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను, ఆయన క్యాంపు కార్యాలయంలో, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సారథ్యంలో ఆసంస్థ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈజన్మదిన మాసోత్సవాల సందర్భంగా కరీంనగర్ జిల్లాలో ఒక లక్ష మందిని కుల మతాలకతీతంగా కలిసి మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను ఆయన జీవితంలో చేసినటువంటి మంచి కార్యక్రమాలను యావత్తు సమాజానికి తెలియపరచి వారిని చైతన్యవంతులుగా చేయడమే జమాతే ఇస్లామీ హింద్ ముఖ్య ఉద్దేశమని, జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సెప్టెంబర్ 19, 20, 21వ తేదీలలో ఎక్స్ పో ఉంటుందన్నారు. ఇందులో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రవక్త జీవిత చరిత్ర కు సంబంధించిన పుస్తకాలను, వివిధ అంశాలను అందుబాటులో ఉంచుతామన్నారు. చివరి రోజు 21న సుమారు వేలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక బహిరంగ సభకు జమాతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షునితోపాటు, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరూ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో , జమాతే ఇస్లామీ హింద్ నాయకులు మహమ్మద్ ఖైరోద్దీన్, నయిమ్, అజీజ్ మహమ్మద్, యాసిర్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# సొప్పరి వినోద్ జన్మదిన వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ యువజన ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ యువ నాయకుడు ఉమ్మాజి నరేష్, పడకల్ శ్రీధర్, పురుషోత్తం, మోపాల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ నాయకులు అరుణ్ ప్రసన్న, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# బాసరలో మంత్రి జూపల్లి కి ఘన స్వాగతం

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 10.

రాష్ట్ర నిషేధ, ఉత్సవాలు, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావును జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ బాసర అతిథి గృహంలో మంత్రి గారి జిల్లా పర్యటన సందర్భంగా చిగురు మొక్కతో ఆహ్వానించారు.భీమసా సబ్-కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి లు కూడా చిగురు మొక్కలు అందించి మంత్రివర్యునికి గౌరవపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం, పోలీసులు మంత్రివర్యునికి గౌరవ వందనం సమర్పించారు.



# ఇందిరమ్మ హౌసింగ్ పనులు ఆలస్యం లేకుండా పూర్తిచేయాలి : జిల్లా కలెక్టర్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 10

జిల్లా కలెక్టర్ నిర్మల్ అభిలాష అభినవ్ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇందిరమ్మ హౌసింగ్ పనులు సమయానికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పథకం పురోగతిని సంబంధిత అధికారులతో సమీక్షించిన సందర్భంగా, ఆలస్యాలు లేకుండా ఉండేందుకు కావలసిన ముడి సరుకు, మానవ వనరులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మంజూరైన ఇళ్ల మంజూరు స్థితి, నిర్మాణ దశల వారీ వివరాలను ఆమె పరిశీలించారు.మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను పర్యవేక్షణపై దృష్టి పెట్టాలని, అమలును క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆమె ఆదేశించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను గుర్తించి మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాల సౌకర్యం కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆమె ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, మండల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బిజెపి ఇన్చార్జి మల్లికార్జున్ రెడ్డి జన్మదినం..

## ఆశ్రమ చిన్నారులకు అన్నదానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో మహతి ఆశ్రమం లో బుధవారం బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.ఏలేటి మల్లికార్జున్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆశ్రమ చిన్నారులకు జిల్లా ప్రధానకార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షులు అంబటి నవీన్ లు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఆశ్రమ చిన్నారులు మల్లికార్జున్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జ్ నరేష్, మండల ప్రధాన కార్యదర్శులు నక్కల గణేష్, జమిలిగిరి సాయికిరణ్, ముప్కాల్ మాజీ సర్పంచ్ ముస్కు భూమేశ్వర్, మండల ఉపాధ్యక్షులు బూసం సత్యనారాయణ, కాల రవి, కిసాన్ మోర్చా మం, అధ్యక్షులు ఆరెపల్లి నర్సయ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు శేరియాల సాయి కార్తీక్, నాయకులు ఐరా ప్రవీణ్, వై.లింగాగౌడ్, శేరియాల జగన్, పట్టణ అధ్యక్షులు ముత్యాల నందిన్, కొత్తింటి రాకేష్, బండారి భూమేష్, తోట నవీన్, తోపారం అశోక్, దుడ్డెల దేవేందర్, సుంకం శ్రీనివాస్, ఠాకూర్ రాము, ఆరెపల్లి రవీందర్, ఉట్నూర్ రాంకిషన్, మగ్గిడి లింగం, కన్న రెడ్డి, ములుగు గణేష్, గంజిగిరి మహేందర్ పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్ ద్వారా తక్షణ న్యాయం

## - ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి శర్మిలా

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 10

జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 13వ తేదీన (సెప్టెంబర్ 2025) నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. జానకి శర్మిలా మాట్లాడుతూ, కేసులు ఉన్న వాదిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కేసులను వేగంగా పరిష్కరించుకోవాలని కోరారు.జాతీయ లోక్ అదాలత్, భారత ప్రభుత్వ ప్రాయోజనంలో జరుగుతున్న ఈ కార్యక్రమం, తక్కువ వ్యయంతో, సఖ్యపూర్వకంగా, త్వరితగతిన న్యాయ వివాదాలను పరిష్కరించుకునే వేదికగా పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. దీని ద్వారా కేసులు సంవత్సరాల తరబడి సాగకుండా త్వరగా న్యాయం లభించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.ట్రాఫిక్ చలానాలు, చిన్న క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు మరియు ఇతర చిన్న కేసులు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని డాక్టర్ జానకి శర్మిలా వివరించారు. వాదిదారులు ముందుకు వచ్చి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, వనరులను ఆదా చేసుకోవచ్చని సూచించారు.అలాగే లోక్ అదాలత్ పరస్పర అంగీకారంతో శాంతియుత పరిష్కారాన్ని ప్రోత్సహిస్తుందని, దీని ద్వారా ఇరువురు పక్షాలకు న్యాయం జరిగి, కోర్టు కేసుల ఒత్తిడిని తప్పించుకోవచ్చని ఆమె తెలిపారు.ఈ నెల 13వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని అందరూ వినియోగించుకొని, తమ పెండింగ్ కేసులను త్వరగా ముగించుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి శర్మిలా వాదిదారులను కోరారు.



# డ్రైనేజీలను శుభ్రం చేయాలి..

## పిచ్చి మొక్కలను తొలగించాలి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్మూర్ పట్టణ మున్సిపల్ వార్డ్ నెం.20 లోని మసీదు దగ్గర డ్రైనేజీలను శుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతూ ఆర్మూర్ పట్టణము మున్సిపల్ కమిషనర్ రాజుకు బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ వసీం వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. సీసీ రోడ్ల పై డ్రైనేజీ నీరు బయటకు వస్తోందని చెప్పారు.



# చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ నివాళులర్పించారు. బుధవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హాజరై, ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అని ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని ,తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని చూపిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# వైద్య చికిత్సకు కలెక్టర్ ఆర్థిక సాయం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

వైద్య చికిత్స నిమిత్తం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 35 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో అందజేశారు. బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఎదురుగట్ల నాగరాజు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లగా, అక్కడ బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం రావడంతో స్వదేశానికి తీసుకువచ్చారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఆయన వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా ఆయన భార్య లావణ్య జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను వేడుకుంది. స్పందించిన జిల్లా కలెక్టర్ వైద్య చికిత్స నిమిత్తం 35 వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును నాగరాజు భార్య లావణ్య కు అందజేశారు. తన భర్త వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ కు లావణ్య కృతజ్ఞతలు తెలిపింది.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం

## సంపాదకీయం

# లొట్టపీసు కేసులపై ముందుకెళ్లేదెలా ?

రాజకీయ అవినీతిపై ఎవరు చర్యలు తీసుకోవాలి...ఎక్కడ దీనికి అంతం పలకాలి. దేశంలో అవినీతి రాజ్యేలుతోంది. పక్కదేశాల్లో ప్రజల తిరుగుబాటు చూశాక పాలకులు కళ్లు తెరవాలి. మనకేం కాదులే అనుకుంటే కుదరదు. ప్రజాగ్రహం కట్టలు తెంచుకునే వరకు చూడకుండా జాగ్రత్త పడాలి. అధికారంలోకి రాగానే అక్రమంగా సంపాదించడం, అధికారం పోగానే లొట్టపీసు కేసుఅంటూ ఎగతాళి చేయడం అలవాటుగా మారింది. ఎపిలో జగన్, తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం అవినీతి కట్టలు తెంచుకుంది. ఇలాంటి అవినీతి కేసులను త్వరగా విచారణ చేయడం ఇప్పుడున్న కోర్టుల పరిధి చాలదు. ఇలాంటి కేసుల్లో సకాలంలో విచారించి శిక్షలు పడేలా చేయాలి. కాళేశ్వరంలో రెండేళ్లుగా విచారణ సాగించి ఇప్పుడు సిబిఐకి అప్పగించారు. అలాగే ఈ ఫార్ములా కేసులో ఎసిబి ఇప్పుడు నివేదిక ఇచ్చింది. ఇవన్నీ చూస్తుంటే సత్వరంగా విచారణ చేసి శిక్షలు పడే దాఖలాలు కనిపించడం లేదు. తప్పు చేసి, అక్రమంగా డబ్బులు సంపాదించిన రాజకీయ నేతల్లో అందుకే ధీమా కనిపిస్తోంది. తమజీవిత కాలంలో విచారణలు జరిగి శిక్షలు పడవన్న ధీమాలో ఉన్నారు. అందుకే పరస్పర విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. లొట్టపీసు కేసు అంటూ ఎగతాళి చేస్తున్నారు. ఈ ఫార్ములాలో అడ్డంగా దొరికిన కెటిఆర్ వ్యాఖ్యలుచూస్తే ఎవరికైనా ఒళ్లు మండుతుంది. క్విడ్ప్రోకో జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా...లొట్టపీసు కేసంటూ ముందునుంచీ ఎదురుదాడి చేస్తున్నారు. ప్రజలు కూడా పెద్దగా రాజకీయనేతల అవినీతిపై చర్చించడం లేదు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో గత పాలకుల అవినీతి తారాస్థాయికి చేరింది. అలాగే రాష్ట్రాలను అప్పుల్లో ముంచారు. తాజాగా ఆర్థిక సంఘం ముందు తెలంగాణ ప్రభుత్వం కూడా అప్పుల గురించి ప్రస్తావించింది. కెసిఆర్, జగన్ పాలనలో అవినీతితో పాటు రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకు పోయాయి. విభజన కారణంగా ఈ రెండు కుటుంబాలు బాగా సంపాదించుకున్నాయని అక్కడ చంద్రబాబు..ఇక్కడ రేవంత్ రెడ్డిలు పదేపదే ఆరోపిస్తున్నారు. అవినీతి కారణంగా విభజిత రాష్ట్రాల్లో అభివృద్ధి పక్కకు పోయింది. అభివృద్ధి పేరుతో అప్పులు మిగిలాయి. అప్పులను రీ స్ట్రక్చర్ చేయాలని కేంద్రం ముందు దేబురిస్తున్నారు. విభజన కారణంగా ప్రజలకు మిగిలింది అప్పులే. ఇలా నేతలు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు అప్పులు చేసి, రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా..కేంద్రం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. రాష్ట్రాలు చేసే అప్పులపై లేదా కేంద్రం చేసే అప్పులపై ఎక్కడా చెక్ లేకుండా పోయింది. అలాగే రాజకీయ నేతల అవినీతిపైనా కోర్టుల్లో కేసులు తేలడం లేదు. దీనిని నివారించి,రాజకీయాల్లో పారదర్శకతను, జవాబుదారీ తనాన్ని తీసుకుని రావాలని లోక్‌పాల్ అవసరం ఉందని గతంలోనే సామాజికవేత్త అన్నా హజారే పోరాటం చేసినా లాభం లేకుండా పోయింది. అన్నా ఉద్యమాన్ని హైజాక్ చేసి, ఆప్ పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ ఇప్పుడు అవినీతి కేసులో ఇరుక్కుని జైలుజీవితం గడిపారు. అధికారం పోగట్టుకున్నారు. కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నించిన కేజ్రీవాల్ ఇప్పుడు కాంగ్రెస్‌తో అంటకాగుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు జగన్, కెసిఆర్ అవినీతి అక్రమాలపై ఎవరు చర్యలు తీసుకోవాలి..ఎవరు కేసులు పెట్టాలన్నదే ప్రశ్న. గతంలో పదేపదే కెసిఆర్ అవినీతి గురించి మాట్లాడిన ప్రధాని మోడీ,అమిత్ షాలు ఇప్పుడు చప్పుడు చేయడం లేదు. బిజెపి నేతలు కూడా మిన్నకున్నారు. ఇప్పుడు అన్నాహజారే లాగా ఎవరో ఒకరు ముందుకు రావాల్సి ఉంది. అవినీతిపై ఉద్యమించాల్సి ఉంది. నేపాల్ హింసాత్మక ఘటనలు చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. అదో చిన్నదేశమని ఊరుకోవడానికి లేదు. ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచఉకోకుండా పాలకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి. అప్పులతో ప్రజలను మోసం చేస్తూ, ఉచిత పథకాల తో ఊరేగడం సరికాదు. ఎందుకంటే రాజకీయ నేతలు అధికారం కోసం ఉచిత తాయిలాలు ప్రకటించి అమలు చేయడంతో రాష్ట్రాలు దివాళా తీస్తున్నాయి. ఇది ఒక్క తెలుగు రాష్ట్రాల సమస్యే కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. ప్రతి రాష్ట్రంలోనూ ఇదే కనిపిస్తోంది. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవిం చాల్సిందే. గతంలో కొన్ని కేసుల్లో ఉన్న జగన్ జైలుకు వెళ్లి వచ్చాక..బెయిల్‌పై ఉంటూ సిఎంగా అధికారంలో ఉన్నారు. నిజానికి మనదేశంలో చట్టాలు సక్రమంగా లేకపోవడం వల్లనే రాజకీ నేరాలకు సకాలంలో శిక్షలు పడడం లేదు. రాజకీయ నాయకులు తాము చేసే అక్రమాలపై సులువుగా తప్పించు కుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కేసునే తీసుకుంటే ఎన్నో ఏళ్లుగా ఇది నానుతోంది. నిజానికి కాలపరిమితి విధించి తీర్పులు వెలువరించేలా మన శిక్షాస్మృతిని మార్చుకోవాల్సిన అసవరం ఉంది. అలాగే కేసుల్లో బెయిల్‌పై ఉన్న వ్యక్తి సిఎం పోస్టుకు తగునా అన్నది కూడా చూడాలి. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఉదంతం, కాళేశ్వరం అవినీతి, విద్యుత్ పేరుతో లెక్కకు అందని అప్పులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు ఊడ్చేశారు. చేపలు, గొర్రెల పంపకంతో కోట్లు మింగారు. తెలంగాణ ఉద్యమం పేరు చెప్పి తెలంగాణలో అధికారం లోకి వచ్చిన మహానుభావులు ఇప్పుడు ఈ అవినీతిపై మాట్లాడం లేదు. కేంద్రంలో పదవులు పొందిన ఇద్దరు మంత్రులు కూడా మాట్లాడడం లేదు. ఇలా నేరాలు చేసే వారంతా మన పాలకులు అవుతూ పోతుంటే ప్రజాస్వామ్యంలో నేర సామ్రాజ్యం రాజ్యమేలుతుంది. దీనికితోడు ఎపిలో అరాచకం, అక్రమాలు రాజ్యమేలాయి. కక్షపూరి రాజకీయాలు రాజ్యమేలుతున్న కాలమిది. హుందా రాజకీయాలను పక్కన పెట్టారు. రాజకీయ నేతలు అవినీతికి పాల్పడితే తాటతీయాల్సిందే. జగన్ పాలనలో జరిగిన ఇసుక, మైనింగ్ మాఫియాలనపైనా చర్యలు తీసుకోవాలి. ఎపి కావచ్చు..తెలంగాణ కావచ్చు... అవినీతి కేసుల్లో ఎవరు ఉన్నా నిగ్గు తేల్చాల్సిందే. ఇలాంటి సదర్భాల్లో కేంద్రంలో ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. పాలకులు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా విచారణ జరపాల్సిందే. లోక్‌పాల్ బిల్లు తెస్తే తప్ప రాజకీయ నాయకుల ఆటలు కట్టించలేం. రాజకీయ అవినీతిపై ప్రత్యేక కోర్టులు ఉండాలి. రాజకీయ అవినీతిని అరికడితే తప్ప మనదేశం దరిద్రం తీరదు. చంద్రబాబు కావచ్చు.. జగన్ కావచ్చు..కెసిఆర్ కావచ్చు..అవినీతి ఎవరిదైనా సత్వర విచారణ చేయించి బొక్కలో తోయాల్సిందే. పాలకులన్న వారు నిజాయితీగా ఉండేలా మన చట్టాలు ఉండాలి. అక్రమ సంపాదనలపై నిఘా కన్ను వేయాలి. లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలన్న అన్నా హజారే డిమాండ్‌ను ప్రధాని మోడీ పక్కన పెట్టారు. లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావడంతో పాటు రాజకీయ నేతల అవినీతి కేసుల్లో త్వరగా విచారణ జరిపి, తీర్పులు వచ్చేలా ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేసుకోవాలి. ఏడాదిలోగా ఎలాంటి కేసుకైనా విచారణ ముగించి తీర్పు వచ్చేలా వ్యవస్థలను బలోపేతం చేయాలి. కఠిన శిక్షలు అమలు చేయాలి. చైనాలోలాగా కఠిన శిక్షలు వేస్తూ పోతే తప్ప రాకీయ అవినీతికి చరమగీతం పాడలేం. కవిత లిక్కర్ స్కామ్ తీసుకుంటే ఇడి,సిబిఐ అధికారులు కేసు నిగ్గు తేల్చలేదు.

# పదునెక్కుతున్న హైడ్రా కోరలు

### ఆక్రమణదారుల్లో గుబులు

హైదరాబాద్,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):

రాష్ట్రంలో హైడ్రా దూసుకుపోతోంది. ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు చేసింది కొంతే అయినా. .హైడ్రా పనితీరుకు ప్రజల్లో మంచి పేరు వస్తోంది. ఆక్రమణలు కూల్చాల్సిందేనని అంటున్నారు. రాజకీయనేతలు, రియల్టర్ల ఆక్రమణలు తొలుత కూల్చాలని కోరుకుం టున్నారు. నాలాలను ఆక్రమించిన వారు ఎవరైనా ఊరుకోవద్దని ప్రజలు సూచి స్తున్నారు. ఇప్పటికే వందల కోట్ల విలువైన ఆస్తును హైడ్రా స్వాధీనం చేసుకుంది. పార్కులను మింగిన వారి నుంచి భూములను లాక్కుంది. జంటనగరాల్లో హైడ్రా వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ క్రమంలో మూసీ డెవలప్‌మెంట్ కోసం సిఎం రేవంత్ దృష్టి సారించారు. ఇందుకు అనుగుణంగా మూసీ ఆక్రమణలపై హైడ్రా దృష్టి పెడుతుందని అంటున్నారు. మూసి ఆక్రమణల తొలగింపు హైడ్రా తదుపరి టార్గెట్‌గా ఉంది. మూసి వైపుకు హైడ్రా బుల్డోజర్లు దూసుకెళ్లనున్నాయి. మూసిలో ఇళ్లను నిర్మించిన వారిపై చర్యలకు హైడ్రా సిద్ధమైంది. మూసి ఆక్రమణల తొలగిం చేందుకు రంగం సిద్ధమైంది. గత 15 ఏళ్ళలో మూసి ఎఫ్టిఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు భారీగా వెలిశాయి. ఇప్పటికే చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ మూసి ఆక్రమణలకు పాల్పడ్డ వారికి నోటీసులు జారీ అయ్యాయి. అర్హులైన బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు కేటాయించేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. మూసి ఆక్రమణలపై ప్రభు త్వానికి హైడ్రా సమగ్ర నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. మూసిలో 10 వేలకు పైగా ఇళ్ళు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అలాగే కొందరు మూసీలో మట్టి నింపి ఆక్రమించి వ్యాపార సముదాయాలు కట్టారు. గండిపేట నుంచి మొదలు నాగోల్ వరకు అనేక చోట్ల ఆక్రమణలు స్పష్టంగా కనిపిస్తున్నారు. మరోవైపు చెరువుల పరిరక్షణ లక్ష్యంతో ఏర్పాటైన హైడ్రాని ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ స్థలాల సంరక్షణ, చెరువులు, నాలాలు, కుంటల ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు, అక్రమ కట్ట డాలను కూల్చివేసేందుకు సంబంధించిన సర్వాధికారాలను హైడ్రాకు అప్పగించారు. రెవెన్యూ, ఆక్రమణల నిరోధం చట్టంపై కలెక్టర్ల నుంచి కిందిస్థాయి వరకు ఉన్న అధికారాలను హైడ్రాకు అప్పగించేందుకు అభ్యంతరాలు లేవని స్పష్టం చేసింది. దీంతో ఇక హైదరాబాద్‌లో ఆక్రమణలపై హైడ్రా మరింద దూకుడు ప్రదర్శిం చనుంది. మూసీ పరివాహకం క్లీన్ కానుంది. అలాగే చెరువులకు విముక్తి దక్కనుంది.

# కాంగ్రెస్‌పై అసంతృప్తి సెగలు

### ఉప ఎన్నికలు వస్తే కాంగ్రెస్ మఠాష్

### చాకలి ఐలమ్మకు వేముల నివాళి

నిజామాబాద్,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):

సుప్రీం తీర్పుపై తాత్సారం చేయడం సరికాదని, ఎమ్మెల్యేల అనర్హతపై త్వరగా తేల్చాల్సి ఉంది. మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ఆ పదిమందిపై వేటు పడక తప్పదన్నారు. తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తున్న ప్రజలు మరోమారు కెసిఆర్ సిఎం కావాలని కోరుకుంటున్నారని, ఉప ఎన్నికలు ఎప్పుడు జరిగినా బిఆర్ఎస్ విజయం తప్పదని వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత ప్రకటిస్తే ఉప ఎన్నికలు ఖాయమని అన్నారు. అదే జరిగితే మళ్లీ బిఆర్ఎస్ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వేముల ఘనంగా నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. ఇప్ప టికిప్పుడు ఎన్నికలు జరిగినా బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇరవై నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజల్లో అప్పుడే నిరాశా నిస్పృహలు ఏర్పడ్డాయని మాజీమంత్రి అన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కెసిఆర్ సంక్షేమ పథకాలు రూపొందించారన్నారు. అవేవీ అమలు కావడం లేదన్నారు. వ్యవ సాయాన్ని ఒక పండుగలుగా మార్చా రన్నారు. ఉచితంగా గొర్రెలను పంపిణీ చేసి.. గొల్ల కురుమల సంక్షేమానికి కృషి చేశారని ప్రశంసించారు. మాంసం ఉత్పత్తిలోనూ తెలంగాణ నంబర్ వన్ గా ఉండేదన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలతో పాలన చేరువైందని, ప్రజల చెంతకే అభివృద్ధి, సంక్షేమం అందిందని పేర్కొన్నారు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి అన్నిహంగులతో కలెక్టరేట్లతో పాటు ఆఫీసు సముదా యాలను నిర్మించా మన్నారు. కొత్త జిల్లాలతోపాటు అవ సరమైన చోట రెవెన్యూ డివిజన్లు, మున్సిపాలిటీలు, మండ లాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసిన గొప్ప పాలనా దక్షకుడు కెసిఆర్ అని కొనియాడారు. వాటి ఫలాలు మన కండ్ల ముందు స్పష్టంగా కనిపి స్తున్నాయని, ప్రతి గ్రామం, పట్టణాలలో జరిగిన అభివృద్ధే ఇందుకు నిదర్శన మన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో ఇవేవీ కనిపించడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు తప్ప, నీటిని ఎత్తిపోసి వినియోగించుకునే ఆలోచనలు చేయడం లేదన్నారు. తెలంగాణకు ఎత్తి పోతలే శరణ్యమని అన్నారు. గత అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిం దేమీలేదని, ఇప్పుడు ఈ పదినెలల్లో మరోమారు అదే రుజువయ్యిందని వేముల అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి కండ్లముందు కనిపిస్తున్నదని చెప్పారు. ఉద్యమ కాలంలో ఇచ్చిన హామీ మేరకు నీళ్లు, నిధులు, నియామకాలు ఇక్కడి వారికి అందిం చడంలో సఫలీకృతు లయ్యారన్నారు. మూ డున్నరేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి బీడు భూములకు గోదావరి జలా లను మళ్లించారన్నారు. మిషన్ భగీరథతో తాగునీటి కష్టాలు తీర్చారని చెప్పారు. సంక్షేమ ఫలాలు అందించడం తో పేదలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగ యువత ఆనందంగా ఉన్నదని చెప్పారు. పేదల అభ్యున్నతి కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా, రైతాంగం మేలు




కోసం రైతుబంధు, రైతుబీమా లాంటి స్కీంలను అమలు చేసామని పేర్కొన్నారు. కేసీఆర్ మన రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తయారు చేశారని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదన్నారు. కానీ కాంగ్రెస్ తిరోగమన విధానాలు మనకు శాపంగా మారాయని అన్నారు. యూరియా కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా పట్టిం చుకోవడం లేదన్నారు.

# ఆర్మీ గుప్పట్లోకి నేపాల్ పాలన

### రాజ్యాంగాన్ని తిరగారా యాలంటున్న జెన్ జడ్


### సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేసిన భారత్

ఖాట్మండ్,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):

హిమాలయ హిందూ దేశం ఆర్మీ చేతుల్లోకి వెళ్లింది. ఆర్మీ కంట్రోల్ చేసేందుకు అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. జెన్–జడ్ ఆగ్రహంతో అల్లకల్లోలమైన నేపాల్‌లో పరిస్థితులను అదుపులోకి తీసుకు వచ్చేందుకు ఆ దేశ ఆర్మీ రంగంలోకి దిగింది. కర్ఫ్యూ ప్రకటిం చింది. మరోవైపు, నేపాల్ అధ్యక్షుడు రామ చంద్ర పౌడెల్నిరసనకారుల బృందంతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో యువ ఆందోళనకారులు తమ డిమాం డ్లను వెల్లడించారు. రాజ్యాంగాన్ని తిరిగిరాయాలని డిమాండ్ చేశారు. ఈ యువతరంగం నేపాల్ పాలనలో సమూల మార్పులు ఆశిస్తోంది. దానికి తగ్గట్టుగా కొన్ని డిమాండ్లను ముందుంచింది. ఈ ఉద్యమం ఒక పార్టీ, ఒక వ్యక్తి కోసం కాదు. మొత్తం ఒక జనరేషన్, దేశ భవిష్యత్తు కోసం. కొత్త రాజకీయ వ్యవస్థ ఆధారంగానే శాంతి నెలకొంటుంది. అధ్యక్షుడు, నేపాల్ సైన్యం మా ప్రతిపా దనలను సానుకూలంగా అమలుచేస్తుందని భావిస్తున్నామని ఓ ప్రకటనలో వారు పేర్కొన్నారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని, మూడు దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు సాగించిన అవినీతిపై దర్యాప్తు జరపాలని కోరుతున్నారు. అలాగే ఈ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అమరులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగాన్ని పారదోలేందుకు, వలసలు అరికట్టేందుకు, సామాజిక అన్యాయాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వీరి బృందం ఆర్మీ ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడిని కలవనుంది. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోన్న భారత్.. సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించడంతో ఒక్కసారిగా పెల్లుబికిన ఆందోళనల తీవ్రతకు కేపీ శర్మ ఓలీ ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. దాంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటయ్యేవరకు పరిస్థితులను చక్కది ద్దేందుకు ఆర్మీ బాధ్యతలు తీసుకుంది. ఈ క్రమంలో సైనికులు రాజధాని కాఠ్ మాండూ వీధుల్లో పహారా కాస్తున్నారు. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని కోరారు.

# నవజాత శిశు మరణాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :





జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఇటీవల నమోదైన నవజాత శిశు మరణాలపై వివరాలు సేకరించి,తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ,జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు హాజరై నివేదికలు సమర్పించారు.ఈ సందర్భంగా ఐసీఎంఆర్ టీమ్ ఐసిఎంఆర్ సంకల్ప పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.జిల్లా కలెక్టర్ తల్లీ శిశు ఆరోగ్య సంరక్షణపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు.తగిన సమయానికి వైద్య సేవలు అందించడం,సక్రమమైన గర్భస్థ శిశు పర్యవేక్షణ,ప్రసూతి సేవల్లో నాణ్యత మెరుగుపర్చడం ద్వారా ఈ మరణాలను తగ్గించవచ్చుఅని కలెక్టర్ పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచనలు చేశారు.జిల్లాలో ఒక అంకెల శిశు మరణాలను సాధించేందుకు కార్యక్రమ అమలు పర్యవేక్షణను బలోపేతం చేయాలని, “15 నుండి 10 కన్నా తక్కువకు శిశు మరణాలను తగ్గించేందుకు దీని కోసం మరింత సమర్థవంతమైన వ్యూహాలు అవసరం” అని పేర్కొన్నారు.జిల్లాలో పీఎం – జన్ మన్ మొబైల్ యూనిట్లు,జనని వేటింగ్ రూమ్స్,నర్సులు%–%మిడ్‌వైఫ్స్‌కి ప్రత్యేక శిక్షణ,నిలోఫర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెంటరింగ్ ప్రోగ్రాం వంటి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ సమీక్షలో రిమ్స్ డెరైక్టర్ జైసింగ్ రాథోడ్,జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్,జిల్లా ఆరోగ్య శాఖ అధికారులతో పాటు ఐసీఎంఆర్ టీమ్, అదనపు డిఎంహెచ్ఓ మనోహర్,ఎస్ఎన్సీయు నోడల్ అధికారి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

భూపాల్ పల్లి సమయ జ్యోతి ప్రతినిధి

విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి అని మహా ముత్తారం మండల విద్యాధికారి మండల రవీందర్ రెడ్డి అన్నారు ములుగు పల్లి ఉన్నత పాఠశాలలో సూర్య కిరణ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ లు పంపిణీ చేసారు ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే సాంబ శివ రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథి ఎం ఈ ఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని ప్రతి విద్యార్థి కష్ట పడి చదివి తల్లి దండ్రలు ఉపాధ్యాయుల కలలు నిజం చేయాలని క్రమ శిక్షణ పాటిస్తూ ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని వారు అన్నారు సేవా గుణంతో సూర్య కిరణ్ సొసైటీ ఫౌండర్ తూడి విద్యా సాగర్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలకు అన్ని రకాలుగా వనరులను సమకూర్చుతున్న వీరి సేవలు ఎనలేనివి అన్నారు వివిధ పాఠశాలలకు సైన్స్ మెటీరియల్ స్పోర్ట్స్ డ్రెస్ విజ్ఞాన విహార యాత్రలు సైకిల్స్ పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు మాజీ మండల విద్యాధికారి పాశం సంజీవ రెడ్డి కృషి తోనే ములుగు పల్లి పాఠశాలకు గత మూడు ఏళ్లుగా అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు ఈ కార్యక్రమం లో మాజీ మండల విద్యాధికారి పాశం సంజీవ రెడ్డి తూడి విధాసాగర్ రెడ్డి డి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ తిరుపతి మాజీ సర్పంచ్ దూలం మల్లయ్య గౌడ్ మాజీ ఎం పి టి సి రాద రాజయ్య ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం కొంకల గీత రెడ్డి ఉపాధ్యాయులు దాసరి రాజేంద్ర ప్రసాద్ అనిల్ నాయక్ సక్కరం నాయక్ కామిడి సతీష్ రెడ్డి ఎస్ చంద్రకళ పెనుకుల యాదగిరి జి సుధాకర్ రెడ్డి ఆర్టు టీచర్ బోనాల వెంకటేష్ నాగరాజు




సంపంగి సదయ్య పాల్గొన్నారు అతిథులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు

# చాకలి ఐలమ్మ స్ఫూర్తి అందరికీ ఆదర్శం

## కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 10 :

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం అని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వినాయక్ నగర్ లో గల ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ అంకిత్, ఇతర జిల్లా శాఖల అధికారులు, వివిద కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకమైన పోరాటం చేశారని గుర్తు చేశారు. తన హక్కుల కోసం ఎలుగెత్తి చాటిన సాహస వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నర్సయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# విపత్తు సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించాలి

## 'ఆపద మిత్ర' మాస్టర్ ట్రైనర్లకు అదనపు కలెక్టర్ హితవు

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 10 :

అనుకోని రీతిలో ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న ఐదుగురు ఆపద మిత్ర వాలంటీర్లు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ను కలిశారు. జిల్లాలో 300 మంది ఆపద మిత్ర వాలంటీర్లు మొదటి విడత శిక్షణ పూర్తి చేసుకోగా, వారిలో నిజామాబాద్ జిల్లా నుండి ఐదుగురిని, ఖమ్మం జిల్లా నుండి ఐదుగురు, నల్లగొండ జిల్లా నుండి పది మందిని మాస్టర్ ట్రైనింగ్ కోసం ఎంపిక చేసి బెంగళూరులోని ఆర్.ఏ.ముండ్ కూరు ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ అకాడమీలో 21 రోజుల పాటు మరింత మెరుగైన శిక్షణ అందించారు. నిజామాబాద్ జిల్లా నుండి ఎన్.సురేఖ, జె.జమున, బి.రాజు, టి.వెంకటేష్, జి.సునీల్ లు శిక్షణను పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ వారిని అభినందిస్తూ, మాస్టర్ ట్రైనర్ సర్టిఫికెట్లను అందజేశారు. మూడు వారాల పాటు బెంగళూరులో అందించిన శిక్షణలో నేర్చుకున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డీ.ఆర్.ఎఫ్, బృందాలు ప్రతీ చోట అందుబాటులో ఉండే అవకాశాలు లేనందున, విపత్తు సమయాలలో తక్షణమే స్పందించి సహాయ కార్యక్రమాలు చేపట్టేలా ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ అందించడం జరుగుతోందని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తెలిపారు. మాస్టర్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వాలంటీర్లు మిగతా వాలంటీర్లకు విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి అనే అంశాలపై మెళుకువలు



తెలుపాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గుర్తుంచుకుని, విపత్తులు వాటిల్లిన సమయాల్లో సుశిక్షితులైన సైనికుల వలె సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు తమ అనుభవాలను, మాస్టర్ ట్రైనింగ్ లో నేర్చుకున్న అంశాల గురించి వివరాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ డి–సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డుల పంపిణి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

ముప్కాల్ మండల కేంద్రంలోని నల్లూరు గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన 45 రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందిగత 10 సంవత్సరాలు పాలనలో లబ్ధిదారులకు రేషన్ కార్డు ఇవ్వడం జరగలేదు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రేషన్ కార్డులకు శ్రీకారం చుటింది అలాగే మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని ఇంకా ముందు ముందు లబ్ధిదారులకు పథకాల అమలు చేస్తామని చెప్పడం జరిగింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి సీతక్కకు బాల్కొండ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ కు ధన్యవాదాలు తెలుపడం జరిగింది కార్యక్రమంలోగ్రామ అధ్యక్షుడు బర్కం గంగాధర్. బొంబాయి రాజు రమణ, ఫణిందర్ గౌడ్, అక్కవత్రి ప్రవీణ్ కుమార్,పాతని పెద్ద గంగాధర్, సాయికుమార్, బర్కం శ్రీనివాస్, బర్కం గంగాధర్, చెన గంగారం, రేషన్ డీలర్ల ప్రెసిడెంట్ కే తిరుపతి, తదితరులు పాల్గొన్నారు



# పాఠశాలకు జలశుద్ధి యంత్రము వితరణ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బుధవారము చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు దంపతులు, సేవా దృక్పథంతో 77 వేల విలువైన జలశుద్ధి యంత్రాన్ని, అలారం బెల్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజిరెడ్డి, నాయకులు చిట్నేని సరిత శ్రీనివాసరావు, షాడ శ్రీనివాస్, చిట్నేని అంజన్ రావు, విద్యాసాగర్ రావు, కోల అక్షయ్, ఎల్ల గౌడ్, సడిమెల బాలయ్య, సబ్బని కమలాకర్, బొంపల్లి సురేందర్ రావు పాల్గొన్నారు.



# మైనర్లు వాహనములు నడపకూడదు : ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్మూర్ పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో బుధవారము ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసిపి మాట్లాడుతూ మైనర్లు వాహనములు నడపకూడదని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రఘుపతి, సిబ్బంది, కళాశాల డైరెక్టర్ నవీన్ పాల్గొన్నారు.



# 11 నుంచి సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు జరపాలి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను గ్రామ గ్రామాన జరపాలని బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి గుంటి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. అమరుల స్తూపాల వద్ద నివాళులర్పించాలని గ్రామ గ్రామాన ఎర్రజెండాలు ఎగరేయాలని జిల్లా విప్లవ ప్రజానీకాన్ని కోరుతున్నాం అన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ తన్నీరు గోపాలరావు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు భూమికోసం భుక్తి కోసం విముక్తి కోసం ఎట్టి చాకిరి నిర్మూలన కోసం, జమీందారుల వ్యతిరేకంగా మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆవునూరు గ్రామానికి చెందిన పురావస్తు శ్రీనివాసచారి ఒకరు మరియు నామాపూర్ గ్రామానికి చెందిన గ్రామ శాఖ కార్యదర్శి నకిర్త ఎల్లన్న తెర్లుమద్ది గ్రామానికి చెందిన బల మల్లయ్యలు అమరులయ్యారు. తెలంగాణ సాయుధ రైతంగా పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి వైఖరిని తిప్పి కొట్టాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాయుధ పోరాట సేనాని కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి తెలంగాణలో నైజాం సర్కార్ పోలీసులసే హత్య చేయబడ్డ కామ్రేడ్ సింగిరెడ్డి భూపతిరెడ్డిల కాంస్య విగ్రహాలను సిరిసిల్ల పట్టణం నడిబొడ్డులో ఏర్పాటు చేయాలని కోరుతున్నాం, అమరుల చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చాల్సిందిగా కోరుతున్నామని అన్నారు.

# అమరచింత లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

అమరచింత మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద వీరనారీమని చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్ర పటానికి రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సుతారి శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి సవరన్న, కోరి శీనువాసులు, సత్యంధర్,సుతారి వెంకటేష్, తాయికుమార్, అజకోల్లు చిన్న రాజా, న్యాయవాది అబ్రహం, లామినేషన్ విజయ్ కుమార్, చరణ్, టీ పాయింట్ శ్రీను, అజంత వెంకటేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతలకు భంగం.. ఇద్దరిపై కేసు నమోదు

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము వెంకట్రావుపల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్ భూమి సమస్యపై గ్రామస్తులు రోడ్డుపై ధర్నా నిర్వహించడంతో గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలిగిందని బుధవారం ఎస్ఐ సిహెచ్ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రెండు కేసులు నమోదు చేశామని, గ్రామంలో శాంతి భద్రతలు కాపాడుటకు, అనవసర సంఘటనలు జరగకుండా ఉండేందుకు సెక్షన్ 144 అమలు చేశాం. గ్రామంలో శాంతి భద్రతలు పరిరక్షించడానికి తగిన బందోబస్తు ఏర్పాటు చేసి, పోలీసులు కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నాం. పరిస్థితి అదుపులో ఉందని అన్నారు.

# నిజామాబాద్ ఐటీ టవర్ టాస్క్ లో కోచింగ్

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్ టాస్క్ ఆఫీసులో ప్రముఖ టెక్నికల్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నారు. జావా, పైతాన్, వెబ్ డెవలప్మెంట్, డేటా బేస్, సూడో కోడ్, సి,సి,౦౦, హెచ్టిఎంఎల్, సిఎస్ఎస్, జావా స్క్రిప్ట్ తో ఆప్టిట్యూడ్ రీజనింగ్ సాఫ్ట్ స్కిల్స్ పై కోచింగ్ ఇస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు నిజామాబాద్ ఐటి టవర్ దిగువ అంతస్తు లోని టాస్క్ ఆఫీసులో సెప్టెంబర్ 15, 16 తేదీలలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోగలరు. ఏదైనా డిగ్రీ లేదా బి.టెక్ అర్హత. వన్ టైమ్ రిజిస్ట్రేషన్ 599/- అదనపు ఛార్జీలు లేవని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ నిజామాబాద్ ఐటీ టవర్ రఘు తేజ పేర్కొన్నారు.




# మంత్రి వెంకటస్వామికి కలెక్టరు పుష్పగుచ్ఛం అందజేత

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లాకు బుధవారము తొలిసారిగా విచ్చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు.



# ప్రసిద్ధ యాత్రాకేంద్రం అయిన బసర జ్ఞాన సరస్వతి ఆలయాన్ని సందర్శించుకున్న మంత్రి జూపల్లి

**సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 10.**

పర్యాటక మరియు సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం ప్రసిద్ధ యాత్రాకేంద్రం అయిన బసర జ్ఞాన సరస్వతి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు మరియు అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో (సాంప్రదాయిక స్వాగతం) స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. మాజీ మంత్రులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, డా.ఎస్.వేను గోపాలాచారి, ఎమ్మెల్సీ దండే విట్టల్ మరియు ఇతరులు మంత్రిని అనుసరించారు.




# నిర్మల్ జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 10.**

మంత్రి జుపల్లి కృష్ణారావు గారు, విభజనకు ముందున్న ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బాసర మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడి వారిని ధైర్యపరిచారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. అధికారులు దెబ్బతిన్న పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆయన ఆదేశించారు. రైతులకు తగిన పరిహారం అందించేందుకు తాను ప్రయత్నిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



# తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమన్ని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ నిజాం భూస్వాములకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీరనారి తెలంగాణ ఆడబిడ్డ చాకలి ఐలమ్మ త్యాగం చిరస్మరణీయం. ఆమె పోరాట స్ఫూర్తి తరతరాలకు ప్రేరణ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్యామ్ ,పోషిరిగారి విష్ణు, కమలాకర్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అద్యక్షుడు ప్రకాశం, సెల్ మండల అద్యక్షుడు హన్మంతు నాయక్,మాజీ ఎంపీటీసీ పి.తిరుమల్లేష్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ తౌఫీక్ ,ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు హరీష్ నాయక్, అను,రాకేష్ గౌడ్,పట్టణ ఉపాధ్యక్షులు పోతు శ్రీధర్, వీరేష్ గౌడ్,ఎస్. కె. రవి, పాష,దేవరాజు, భరత్, మోహన్ రెడ్డి, బాల రాజు, మైను ,నరసింహ,పవన్ కుమార్ రెడ్డి,ఖదీర్, సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# టెంబి ఋషి పంచమి వేడుకలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 10 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలంలోని మంజిరాం తాండ గ్రామంలో మథుర సమాజ్ వార్ ప్రతి ఏటా నిర్వహించే ఋషి పంచమి వేడుకలకు ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్యావ్ సింగ్ మహరాజ్ ని సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఋషి పంచమి కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కి ధర్యావ్ సింగ్ మహరాజ్ సన్మానించి ఆశీర్వదించారు. అనంతరం మథుర సాంప్రదాయపు పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరి వెంట మథుర సమాజ్ నాయకులు నానక్ సింగ్, ప్రతాప్ సింగ్, కైలాష్ సింగ్, చందర్ సింగ్, సరిచంద్, మంగల్ సింగ్, గులాబ్ సింగ్, మెర్బాన్, బాదల్ సింగ్, ఉత్తమ్ సింగ్, మెర్సింగ్ తో పాటు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# బాధిత కుటుంబానికి బీజేపీ ఆర్థిక సాయం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలకేంద్రానికి చెందిన పిట్ల కర్రోళ్ల చిన్న రాజన్న భార్య సత్తెమ్మ మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, బాల్కొండ బీజేపీ నాయకులు 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు అంబటి నవీన్, సిరియాల జగన్, ఆరేపల్లి నరసయ్య, ఠాకూర్ రాము, లింగా గౌడ్, కాల రవి, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు



# ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే జీ ఎం ఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో 33 కోట్ల 13 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన రెండు మిలియన్ లీటర్ల ఈఎల్ఎస్ఆర్ నాలుగు మిలియన్ లీటర్ల జీఎల్ఎస్ఆర్ రిజర్వాయర్లు పంపు హౌస్ పైపులైన్ వ్యవస్థను ప్రారంభించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఎమ్మెల్సీ అంజిరెడ్డి జలమండలి అధికారులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# వాగు దాటి వైద్యశిబిరం ఏర్పాటు.

**సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 10 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలం లోనిగిర్నూర్ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంకు వెళ్ళాలి అంటే బండరేవ్ అనే వాగు దాటాల్సి ఉంటుంది. ఆగ్రామ ప్రజలకు ఇది నిత్య సవాలే.ఈ గ్రామం మండల కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వర్షం వస్తేబండరేవ్ వాగు పొంగి ప్రవహిస్తుంది.ఎవరి నిర్లక్ష్యమో, ఈ గ్రామస్తులకు శాపమో కానీ... 60 సంవత్సరాల నుంచి గ్రామానికి... ఇప్పటివరకు సరైన రోడ్డు మార్గం వాగుపై వంతెన లేకపోవడం బాధాకరం.బుధవారం నాడు బజార్ హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కుర్సెంగే భీమ్ రావు, ఆయన సిబ్బందితో నడుచుకుంటూ వాగుదాటి ట్రాక్టర్లో ఎక్కి గ్రామానికి చేరి... వైద్య శిబిరం చేపట్టారు.ఆ గ్రామస్తులకు వైద్యం అందించి తగు జాగ్రత్త లు పాటించాలని ఆరోగ్య మెలకువలు తెల్పి, సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్. ఎల్.హెచ్.పి. కళ్యాణి, ఏ. యన్.యం. అనిత, హెల్త్ అసిస్టెంట్ శంకర్, ఆశాలు దురపత, శకుంతల, సవిత, దుర్గ,.. అంగన్వాడి టీచర్ సంగీత కారోబారి నరేష్ గ్రామపంచాయతీ సిబ్బంది దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఖగోళ శాస్త్ర ప్రయోగశాల ప్రారంభం

## రైతులకు వరద సాయం అందజేస్తామని మంత్రి జూపల్లి హామీ

**సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 10.**

రాష్ట్ర నిషేధ మరియు ఎక్సైజ్‌శాఖ మంత్రి, నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం సాయంత్రం సోన్ మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఖగోళ శాస్త్ర ప్రయోగశాలను సందర్శించారు.జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్‌తో కలిసి మంత్రి ప్రయోగశాలలో ఏర్పాటు చేసిన పరికరాలు, మోడల్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, ప్రశ్నలు అడిగి వారి జ్ఞానాన్ని అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇలాంటి ప్రయోగశాలలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృష్టికోణాన్ని విస్తరింపజేస్తాయని, భవిష్యత్తులో ఖగోళశాస్త్రంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రేరణ కలిగిస్తాయని అన్నారు.తరువాత మంత్రి గ్రామ పరిసరాల్లోని వరి, పత్తి పొలాలను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని సమీక్షించారు. రైతులతో మాట్లాడి, నష్టపోయిన ప్రతి రైతుకీ ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని హామీ ఇచ్చారు.అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్, భైంసా సబ్-కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈఓ భోజన్నతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.



# మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

## సన్మానం చేసిన మండల విద్యాధికారి నిజాముద్దీన్.....

సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణపేట జిల్లా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కృష్ణలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధువారం మండల విద్యాధికారి నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు వై జనార్ధన్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్, కిశోర్ కుమార్ మరియు కూన్సీ ప్రధానోపాధ్యాయురాలు సంతోషి పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి, విద్యార్థుల చదువు మరియు పాఠశాలల అభివృద్ధిపై ప్రసంగించారు. మండల స్థాయిలో 8మంది ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో కుర్మన్న,జి నాగరాజు,టి రేణుక, శరణప్ప,పి శ్రీనివాసులు, పద్మ,ఖాసీం అలీ,కల్యాణి లను ఉత్తమ ఉపాధ్యాయులుగా మరియు గంగాధర్, శోభారాణి,రవి తేజ,ఖాసీం అలీలను ప్రోత్సాహక బహుమతులతో సత్కరించారు..ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సిఆర్పి అమీన్ రెడ్డి పాల్గొన్నారు




# మహిళా కేర్ టేకర్ నియామకానికి దరఖాస్తు చేయాలి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో, ఏదైనా డిగ్రీతోపాటు డిఈడీ విద్యార్హత గల18 నుండి 45 సంవత్సరాల వయసు గల మహిళా కేర్ టేకర్ గా నియామకానికి ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ముస్తాబాద్ ఎంఆర్సి కార్యాలయంలో దరఖాస్తు చేయాలని బుధవారము ఎంఈఓ ఎన్.రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



# ప్రతిభ చాటిన చిట్టాపూర్ విద్యార్థులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల్కొండ మండలం చిట్టాపూర్ జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు, చిమ్మపూడి ఫౌండేషన్ హైదరాబాద్ వారు నిర్వహించిన పోటీలో మన సామెతలు..జాతీయాలు అంశంపై చక్కగా వ్రాసి జూనియర్ విభాగంలో రంగు వైద్రితి ప్రథమ, రామగిరి హాసిని ద్వితీయ, సీనియర్ విభాగంలో కచ్చు లాస్యశ్రీ ప్రథమ, కోల రక్షిత ద్వితీయ బహుమతులు సాధించగా వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు నర్సారెడ్డి, భృగు మహర్షి, రామారెడ్డి, శ్రీనివాస్, పద్మ, ప్రవీణ్, రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.




# చాకలి ఐలమ్మ స్ఫూర్తి తో ముందుకు సాగాలి

## కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ బాలవిహార్ పార్క్ చాకలి ఐలమ్మ విగ్రహానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు రజకులతో కలిసి నివాళులు అర్పించిన స్థానిక రామచంద్రపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మాట్లాడుతూ తెలంగాణ తొలి భూపోరాట వీరవనిత నిజాం రజాకార్ల అరాచకాలకు నిరంకుశత్వానికి బానిసత్వానికి ఎదురొడ్డి నిలిచిన ఉద్యమ కాగడా చాకలి ఐలమ్మ అని తెలంగాణ చరిత్రలో చిట్యాల ఐలమ్మ పాత్ర వెలకట్టలేనిదన్నారు బడుగు జీవుల అస్థిత్వాన్ని పరిరక్షించడానికి బందుకులు పట్టి సమానత్వం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు ఆమె స్ఫూర్తితో మనమంతా ముందడుగు వేయాల్సిన అవశ్యకత ఉందన్నారు వారితో ఆత్మ కమిటీ డైరెక్టర్ కావాలి నగేష్ మాజీ ఏఎంసి డైరెక్టర్ ఐలాపూర్ ఐలేష్ పీటర్ పాల్స్ మైనారిటీ అధ్యక్షులు హబీబ్ జానీ శాంతమ్మ నవీన్ గౌడ్ బైకన్ నవీన్ యాదవ్ రాంజీ చాకలి నర్సింహా చాకలి శ్రీను నర్సింహా హన్మంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



# చాకలి ఐలమ్మ వర్ధంతి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో బుధవారము రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, కళ్యాణ్ రాజేందర్, మీర చంద్రశేఖర్, అశోక్, గంగరాజుల రాజేందర్ ముత్యం, మహేష్, చిన్న సాయిలు, గంగాధర్ సభ్యులు పాల్గొన్నారు.



# విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ తాసిల్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీనివాస్ సమక్షంలో బుధవారము 8 మంది గ్రామ పాలన అధికారులు లక్ష్మీ నారాయణ, రాజేష్, పుప్పాల ప్రేమ్ కుమార్,మగ్గిడి రాజేశ్వర్, కొండా మనోహర్, తలారి శేఖర్, హేమలత, ఎం.సాగర్ విధుల్లో చేరారు.

# ఎస్సీ హాస్టల్ విద్యార్థుల ప్రవేశాల ఎంపిక

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ హాస్టల్ విద్యార్థుల ప్రవేశాల ఆమోదం కోసం సలహా కమిటీ సమావేశం జరిగింది. డివిజన్ పరిధిలోని సిరిసిల్ల, గంభీరావుపేట, ముస్తాబాద్, ఈల్లంతకుంట, మండల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్, డీఎస్సీడివో, ఎస్సీ డిడి, ఎస్ డబ్ల్యూఓ కన్వీనర్ గా వ్యవహరించి, 119 మంది ప్రవేశాలను ఆమోదించారు. ఇంకా 254 ఖాళీల ప్రవేశానికి సహకరించాలని పేర్కొన్నారు.



# విమోచన వేడుకలను జయప్రదం చేయండి ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని బీజేపీ స్టేట్ చీఫ్ శ్రీ రాంచంద్ర రావు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని బీజేపీ యువ మోర్చా నూతన అధ్యక్షులు శ్రీ గణేష్ ను ఇతర నాయకులను ఆహ్వానించినట్లు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు 17 సెప్టెంబర్ ప్రధానమంత్రి మోదీ జన్మదినం పురస్కరించుకొని యువ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవ కార్యక్రమాలను నిర్వహించాలని ఎంఎల్సీ సూచించారు




# విమోచన వేడుకలను జయప్రదం చేయండి

## ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని బీజేపీ స్టేట్ చీఫ్ శ్రీ రాంచంద్ర రావు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని బీజేపీ యువ మోర్చా నూతన అధ్యక్షులు శ్రీ గణేష్ ను ఇతర నాయకులను ఆహ్వానించినట్లు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు 17 సెప్టెంబర్ ప్రధానమంత్రి మోదీ జన్మదినం పురస్కరించుకొని యువ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవ కార్యక్రమాలను నిర్వహించాలని ఎంఎల్సీ సూచించారు




# చాకలి ఐలమ్మకు కాంగ్రెస్ నాయకుల నివాళ్లు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

వీరనారి చాకలి ఐలమ్మ ప్రజా పోరాటాలకు స్ఫూర్తి గా నిలిచారని కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు.బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఆ పోరాట యోధురాలి సేవలను కొనియాడారు.భూమికోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం నిజాం నవాబుకు,భూస్వాములకు వ్యతిరేకంగా ఎర్ర జెండా చేతపట్టి ఎదురు తిరిగిన వీరనారి చాకలి ఐలమ్మ అని గుర్తుచేసుకున్నారు.ఆమె వర్ధంతి సందర్భంగా గొప్ప పోరాట యోధురాలిని స్మరించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్,దొగ్గలి రాజేశ్వర్,ఏవన్,కొండూరి రవి,ముహమ్మద్ రఫీక్,మానే శంకర్,అశోక్,రాంరెడ్డి,సాహెబ్ రావు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి జూపల్లి మినీ ట్యాంక్ బండ్ లేక్ వ్యూ పాయింట్ ప్రారంభం

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 10.

నిర్మల్ పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద కొత్తగా నిర్మించిన లేక్ వ్యూ పాయింట్‌ను బుధవారం సాయంత్రం రాష్ట్ర నిషేధ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి (జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి) జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే ఆలేటి మహేశ్వర్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్మల్ పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజలకు వినోదం మరియు విశ్రాంతి కలిగించేందుకు లేక్ వ్యూ పాయింట్‌ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఇటువంటి ప్రాజెక్టులు పర్యాటక అభివృద్ధి, పచ్చదనం పెంపు మరియు పట్టణ అందాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలను అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.అదనపు కలెక్టర్ ఆఫ్ లోకల్ బాడీస్ ఫైజాన్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, అధికారులు మరియు ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ప్రజల అవసరాలకు అండగా నిలుస్తున్న సీఎం సహాయనిధి

## రూ.5 లక్షల 500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందజేత

## ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అండగా ప్రభుత్వం - మంత్రి వాకిటి శ్రీహరి

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ....**

**నారాయణ పేట జిల్లా**

మక్తల్ నియోజకవర్గంలోని మంత్రి నివాసంలో బుధవారం సీఎం సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్) ద్వారా మొత్తం రూ. 5 లక్షల 500 విలువైన చెక్కులను లబ్ధిదారులకు మంత్రి డా. వాకిటి శ్రీహరి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందనే సంకల్పంతో సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించబడుతోంది. ఈ నిధులు లబ్ధిదారుల జీవితాల్లో ఉపశమనం కలిగించాలని మంత్రి ఆకాంక్షించారు. కృష్ణ మండలం సుకుర్ లింగంపల్లి గ్రామానికి చెందిన అంజప్ప, ఊట్కూరు మండలంపులిమామిడి గ్రామానికి చెందిన ప్యాట అనంతమ్మ, డి.ప్రియాంక ఎర్రన్నోళ్ల యదేశ్వరి, కుర్వ హనుమంతు, కొక్క రాము కురువ బలరాం, పెద్ద జెట్రం గ్రామానికి చెందిన జోగు నర్సింలు,చిన్న నర్సింలు,తిప్రాస్ పల్లి గ్రామానికి చెందిన ప్రశాంతి,బిజ్వార్ గ్రామానికి చెందిన సింగారం చంద్రశేఖర్ రెడ్డి ఓబ్లపూర్ గ్రామానికి చెందిన వెంకటమ్మ లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన పద్మమ్మ,ఎడివెల్లి గ్రామానికి చెందిన అనిత బంగారి,కొల్లూరు గ్రామానికి చెందిన కుర్వ వెంకటప్ప,నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన భీములప్ప,మక్తల్ మండలం దాసర్ పల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య



చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గణేష్ కుమార్, విగ్నేశ్వర్ రెడ్డి, రాజప్ప గౌడ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇసుక కాస్టింగ్,భూముల పునరుద్ధరణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

కేంద్ర మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు,ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం ప్రకారం,వరద ప్రభావిత భూముల పునరుద్ధరణకు అనుమతించబడిన పనుల్ని చేపట్టేందుకు పిఆర్ మరియు ఆర్డి శాఖ ప్రత్యేక సూచనల మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఇసుక కాస్టింగ్ పై గూగుల్ మీట్ ద్వారా సీఈఓ జడ్పీ,డిఆర్డీఓ,డీపీఓ,ఎంపీడీఓ,ఎంపీవో,మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు,సలహాలు చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు,ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం ప్రకారం,ఇటీవల 2025 ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా చోటు చేసుకున్న భారీ వర్షాలు,వరదల కారణంగా సాగుకు ఇబ్బంది కలిగిన భూముల పునరుద్ధరణ కోసం అనుమతించబడిన పనులను చేపట్టేందుకు ప్రాథమిక చర్యల నేపథ్యంలో,ఇసుక కాస్టింగ్,భూముల పునరుద్ధరణలో అనుసరించవలసిన మార్గదర్శకాలను అధికారులు సమగ్రంగా పాటించాలని సూచించారు. వరద ప్రభావిత రైతుల భూముల్లో బీడు/వ్యర్థ భూముల అభివృద్ధి,ఇసుక తొలగింపు,చదును చేయడం,ఆకృతి చేయడం వంటి పనులు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద అనుమతించబడిన కార్యక్రమాలుగా చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ ధృవీకరణతో లబ్ధిదారుల జాబితాలు,భూ వివరాలు,సర్వే నంబర్లు తగిన విధంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రీ-మెజర్మెంట్స్,సంయుక్త తనిఖీలు,గ్రామసభ ఆమోదాలు వంటి ప్రక్రియలు వేగవంతం చేయాలని తెలిపారు. రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌కు సమయానికి సాగు ప్రారంభించేందుకు వీలుగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యకలాపాల అమలులో అర్హులైన రైతులకు మద్దతు ఇవ్వడం,భూమి ఉత్పాదకతను పునరుద్ధరించడం,జీవనోపాధి భద్రతను నిర్ధారించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వర్షభాదిత ప్రాంతాల్లో రైతులు మళ్లీ సాగు చేసుకునేలా సాంకేతికంగా పరిపాలనా పరంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. వరదల కారణంగా ఇసుక మేటలతో నిండిపోయిన భూముల పునరుద్ధరణ లో ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు,వరదల కారణంగా పలు మండలాల్లో పంట భూములు ఇసుకతో నిండిపోవడం,భూమి కోతకు



గురవడం,ఇసుక మేటలు ఏర్పడడం వంటి సమస్యలు చోటుచేసుకున్నాయి. రైతులకు కలిగిన నష్టాన్ని నివారిం చేందుకు,భూములను మళ్లీ సాగుకు అనుకూలంగా మార్చేందుకు ఇసుక ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు ఎంజిఎన్ఆర్ ఇజిఎస్ నిబంధనల ప్రకారం చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆదిలాబాద్ రూరల్,భోరజ్,జైనథ్,గుడిహత్నూర్,ఇచ్చోడ,సిరికొండ,నేరడిగొండ మండలాల్లో పరిమాణాన్ని అంచనా వేయడానికి (ప్రీ మెజర్మెంట్స్) వ్యవసాయ అధికారితో పాటు ఎంపీడీఓ,ఏపీవో,ఈసీ,టీఏ సంయుక్త తనిఖీని నిర్వహించాలని ఈ నెల 12వ తేది నుండి 20వ తేదీ వరకు ఉమ్మడి తనిఖీ పూర్తయిన తర్వాత,పంచాయతీ కార్యదర్శి ల్యాండ్ డెవలప్‌మెంట్ ఫార్మాట్‌ను పూరించాలన్నారు. దీని ఆధారంగా,టెక్నికల్ అసిస్టెంట్ అంచనాను సిద్ధం చేయడం జరుగుతుందని,ఎంజిఎన్ఆర్ఈజీ చట్టం ద్వారా నిర్దేశించబడిన విధంగా లబ్ధిదారుల వారీగా ప్రతిపాదిత పనులను సంబంధిత గ్రామసభలలో ఆమోదించి,పనులు చేపట్టాలని అన్నారు. ఈ గూగుల్ మీట్ లో సీఈఓ జితేందర్ రెడ్డి,డిఆర్డీఓ రవిందర్,సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలు చేయాలి.- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఎన్ని ప్రభుత్వాలు మారిన,ఎన్ని పోరాటాలు చేసినా బీసీ కులాల లోని ప్రజల బతుకులు మాత్రం మారడం లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. చాకలి ఐలమ్మ చూపిన తెగువను స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక రిమ్స్ ఆసుపత్రి వద్ద బుధవారం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి,రజక సంఘం నాయకులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆనాడు చాకలి ఐలమ్మ చూపిన తెగువ,పోరాటపటిమా తెలంగాణ యావత్ ప్రజానీకానికి,తెలంగాణ సాయిధ పోరాటానికి ఊపిరినిచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ తలరాతలు మారుతాయని రాష్ట్ర సాధన పోరాటంలో ముందు వరుసలో ఉన్న బీసీలు,ఎన్నో ప్రాణ త్యాగాలు చేశారని,కానీ రాష్ట్రం వచ్చిన బీసీ చేతి వృత్తి కులాలు కష్టాల్లోనే ఉన్నాయని అన్నారు. వర్ధంతి,జయంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించడంతో పాటు తెలంగాణలోని 33 జిల్లాల్లో చాకలి ఐలమ్మ విగ్రహాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీసీ సంఘం నాయకులు,రజక సంఘం నాయకులు,బిజెపి నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బిసి సంఘ నాయకులు చిక్కాల దత్తు,సంతోష్,వినోద్,భరత్ భారతీయ జనతా పార్టీ నాయకులు ఆదినాథ్,లాలామున్న,రఘుపతి,సచిన్,నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.






# ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ గ్రామీణ మండలం పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేసే సిబ్బంది విధులను పరిశీలించారు. మొదటగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి,పరిశుభ్రత పాటించాలని పోలీస్ స్టేషన్ లో ఉన్న వాహనాల కు సంబంధించిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించి సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా,బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించే దిశగా సిబ్బందిని కేటాయించి పరిష్కరించాలని సూచించారు. విపిఓ విధానాన్ని తప్పకుండా అమలు చేయాలని వారంలో రెండుసార్లు గ్రామాలను సందర్శిస్తూ గ్రామాలలో జరుగు అసాంఘిక కార్యకలాపాల పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాల ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండిగ్స్ లేకుండా ఉండాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని రాజీ కుదురుచుకుంటున్న వారిని సంప్రదించి న్యాయబద్ధంగా రాజీ కుదుర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను 5యస్ విధానాన్ని అమలు చేసి ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి సమయాలలో గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను అరికట్టే దిశగా సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి,రూరల్ సీఐ కె ఫణిదర్,ఎస్ ఐ వి విష్ణువర్ధన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైంది.

## మార్కెట్ చైర్మన్ ఎం.డి రహమతుల్లా

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**

ఆత్మకూరు మండల కేంద్రంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికిమండల విద్యాధికారి కే. బాలరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమతుల్లా తులసి రాజు యాదవ్ హాజరైన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యావృత్తి చాలా పవిత్రమైనదని అన్నారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో అత్యుత్తమ సేవలు అందించిన 18 మంది ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి ప్రశంసాపత్రము మెమొంటో బహుకరించి సన్మానం చేయడం జరిగింది. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని 6 మంది ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి. మద్దిలేటి,జే బాల స్వామి,గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జిందె అనంతరాం, బి. శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ వివిధ సంఘాల బాధ్యులు మండల పరిధిలోని ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# కొల్హారీ వంతెన వద్ద బీ టి రోడ్డు నిర్మించగలరు

**సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 10 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలం లోని కొల్హారీ గ్రామ సమీపంలో వాగు పై వంతెన నిర్మించి ఇరు వైపుల బీ టి రోడ్డు లేని కారణంగా సోనాల ఇచ్చోడ ప్రధాన రహదారి పై ఉంది వర్షాలకు వంతెన వద్ద వాహనాలు బురదకు సైడ్ దిగిపోయే ప్రమాదం ఉంది సంబధిత అధికారులు స్పందించి తక్షణమే వంతెన వద్ద బీ టి రోడ్డు వేసి వాహనదారులకు ఇబ్బందులను తొలగించగలరు అని ప్రయాణికులు కోరుతున్నారు



# ఆర్మీ గుప్పట్లోకి నేపాల్ పాలన

## రాజ్యాంగాన్ని తిరగా రాయాలంటున్న జెన్ జడ్

## సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేసిన భారత్

**ఖాట్మండ్,సెప్టెంబర్10(సమయ జ్యోతి):**

హిమాలయ హిందూ దేశం ఆర్మీ చేతుల్లోకి వెళ్లింది. ఆర్మీ కంట్రోల్ చేసేందుకు అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. జెన్-జడ్ ఆగ్రహంతో అల్లకల్లోలమైన నేపాల్‌లో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఆ దేశ ఆర్మీ రంగంలోకి దిగింది. కర్ఫ్యూ ప్రకటించింది. మరోవైపు, నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్నిరసనకారుల బృందంతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో యువ ఆందోళనకారులు తమ డిమాండ్లను వెల్లడించారు. రాజ్యాంగాన్ని తిరిగిరాయాలని డిమాండ్ చేశారు.

# జూబ్లీహిల్స్ నుంచే బిఆర్ఎస్ జైత్రయాత్ర

## జమీక్షా సమావేశంలో కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్,సెప్టెంబర్10(సమయ జ్యోతి )**

అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉంటుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీ-ఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు అందరి ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి అని పేర్కొన్నారు. ఓటు-కు రూ.5 వేలు పంచితే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు అనుకుంటు-న్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సీఎం సోదరుడు చెరువులో ఇల్లు కట్టినా హైడ్రా వెళ్లదని.. కానీ పేదల బస్తీలకు వెళ్లి ఇళ్లు కూలగొడతారని విమర్శించారు. ఉపఎన్నిక కోసం సర్వేలు చేయిస్తున్నాం.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగుంది. కొన్ని బస్తీల్లో వెనకంజలో ఉన్నాం. అందరూ కలిసికట్టు-గా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు- ఉంటే తొలగించాలి.. లేనివారివి చేర్చాలి. ఓటు-



వేయకపోతే సంక్షేమ పథకాలు బంద్ చేస్తామని.. ఇళ్లు కూలుస్తామని అంటారు. పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ మూసీ ప్రాజెక్టుకు డబ్బులు ఉన్నాయట. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చూపాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరు. మాగంటి గోపీనాథ్‌లాగే తనకూ అండగా నిలవాలని కార్యకర్తలను ఆయన సతీమణి సునీత కోరారు. గోపీనాథ్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరమూ కలిసి పనిచేద్దామన్నారు. భారత రాష్ట్ర సమితిలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉందని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు.

# ఇచ్చిన హామీ మేరకు పేలకు ఇళ్లు

## మంత్రి వివేక స్పష్టీకరణ

**సిరిసిల్ల,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మంత్రి వివేక్ వెంకటస్వామి. సిరిసిల్లలో సకలజనుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్ హయాంలోనే కాళేశ్వర కట్టారు..వాళ్ల హయాంలోనే కూలిందన్నారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పచ్చి అబద్దాలు చెబుతోందని విమర్శించారు. ఇరిగేషన్ పై కేటీఆర్ కు కనీస అవగాహన లేదన్నారు. కాంగ్రెస్ కట్టిన ఎల్లంపల్లి నుంచే గోదావరి నీళ్లు హైదరాబాద్ కు తరలిస్తామని చెప్పారు. కేసీఆర్ ఫ్యామిలీపై కవిత ఆరోపణలకు సమాధానం చెప్పాలని వివేక్ డిమాండ్ చేశారు. అమరుల త్యాగాలతోనే తెలంగాణ వచ్చిందన్నారు మంత్రి వివేక్. యువకుల బలిదానాలు చూసి చలించి పోయిన సోనియా తెలంగాణ ఇచ్చిందన్నారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు లక్ష ఇచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో ఇసుక మాఫియా రాజ్యమేలిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్కిల్ డెవ్ లప్ మెంట్ తో యువతతలో నైపుణ్యం కల్పిస్తు న్నామని చెప్పారు.పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని.. కల్వకుంట్ల కుటుంబం ఖజానా ఖాళీ చేసినా..సీఎం రేవంత్ రెడ్డి స్కీమ్స్ కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం 2లక్షల ఉద్యోగాల భర్తీ కొనసాగు తుందన్నారు. సిరిసిల్లలో జౌళి శాఖ కార్మికులను న్యాయం చేయాలని కోరు తున్నారు... తప్పకుండా వారికి అండగా ఉంటామని తెలిపారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్ లో కాక స్ఫూర్తితోనే కోట్లా డామని తెలిపారు. సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

# పొరుగుదేశాల్లో ఏం జరుగుతందో చూడండి

## అందుకే మన రాజ్యాంగం పట్ల మేం గర్విస్తున్నాం

## గవర్నర్ల కేసు సందర్భంగా చీఫ్ జస్టిస్ ఆసక్తికర వ్యాఖ్య

**న్యూఢిల్లీ,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

సుప్రీంకోర్టు బిల్లులను గవర్నర్లు పెండింగ్‌లో పెట్టే అంశాన్ని విచారిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలను ప్రస్తావించింది. బుధవారం సుప్రీంకోర్టులో ఏప్రిల్ 12న ఇచ్చిన ఉత్తర్వులపై విచారణ జరిగింది. రాష్ట్రాలు రూపొందించి బిల్లును క్లియర్ చేయడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులను ఇచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భారత రాజ్యాంగాన్ని ప్రస్తావిస్తూ.. ప్రజా ప్రాముఖ్యత లేదా ఏ విధంగానైనా ప్రజల్ని ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరే హక్కును నిర్వచించింది. 'మన రాజ్యాంగం పట్ల మేమే గర్విస్తున్నాము' అని ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అన్నారు. మన పొరుగు దేశాల్లో ఏం జరుగుతుందో చూడండి, నేపాల్ పరిస్థితిని చూశామని సీజేఐ అన్నారు. నేపాల్‌లో జెన్ జెడ్ యువత చేస్తు హింసాత్మక ఆందోళనల్ని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బంగ్లాదేశ్ కూడా ఇలాంటివే జరిగాయని జస్టిస్ విక్రమ్ నాథ్ జోక్యం చేసుకున్నారు. గతేడాది బంగ్లాదేశ్‌లో హింసాత్మక అల్లర్ల కారణంగా, షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చారు. ఒక నెలకు పైగా బిల్లులను రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్లను సమర్థిస్తూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమర్థించిన తర్వాత సుప్రీంకోర్టు నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లుల్లో 90 శాతం ఒక నెలలోపే గవర్నర్లు క్లియర్ చేస్తారని తుషార్ మెహతా కోర్టుకు వెల్లడించారు. 1970 నుంచి 2025 వరకు 20 బిల్లులు మాత్రమే రిజర్వ్ చేయబడ్డాయని కోర్టుకు తెలియజేశారు. అయితే, ఈ గణాంకాలను తాము పట్టించుకోమని న్యాయమూర్తులు అన్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 7 బిల్లులను రిజర్వ్ చేయడంతో డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రాల బిల్లుల ఆమోదంలో న్యాయస్థానం తనకు గడువు నిర్దేశిరచడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరిన అభిప్రాయం అంశమై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం వాదనలు కొనసాగాయి. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

# సూపర్ సిక్స్ ఓ అట్టర్ ఫ్లాప్ సినిమా

## ఆడని సినిమాకు విజయోత్సవాలా?

## రైతులు,ప్రజల సమస్యలు పట్టని చంద్రబాబు

## అబద్దాలను అప్పగించడంలో చంద్రబాబు దిట్ట

## అనంతపురం సభపై జగన్ విమర్శలు

**అమరావతి,సెప్టెంబర్ 10(సమయ జ్యోతి**

కూటమి ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్.. అట్టర్‌ఫ్లాప్ సినిమా అని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ అనే.. అట్టర్ ఫ్లాప్ అయిన సినిమాకు బలవంతపు విజయోత్సవాలు జరుపుతున్నారు. అనంతపూర్‌లో ఇవాళ ఇదే చెప్పచోతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అబద్ధాలు, మోసాలు ఒక స్థాయిలోనే ఉంటాయి. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే వ్యక్తి చంద్రబాబు అని సెటైరికల్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో జగన్ మాట్లాడుతూ .... సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అని ప్రజలకు అర్థమైంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన అడ్వర్-టైజ్‌మెంట్.. ఇది ఏ లెవల్ మోసమో.. వాళ్ల అనుకూల మీడియాలో వచ్చిన అడ్వైర్-టైజ్‌మెంట్లను చూడండి. 50 ఏళ్ల వాళ్లకు పెన్షన్ తీసేశారు. ఆడబిడ్డ నిధి ఎగిరిపోయింది. మూడు వేల రూపాయల నిరుద్యోగ భృతి.. కనిపించడం లేదు. క్యాంటీన్లను ఇప్పుడు కొత్తగా సూపర్‌సిక్స్‌లో చేర్చారు. ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీలతో పాటు- అదనంగా ఇస్తానని చంద్రబాబు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌కు ఈరోజు సూపర్ సిక్స్ పొంతన లేదు. ఇప్పుడు ఇచ్చేది కాకుండా రైతులకు అదనంగా రూ.20వేలు ఇస్తామన్నారు. తల్లికి వందనం కింద ఆంక్షలు లేకుండా ప్రతీ బిడ్డకు రూ.15వేలు ఇస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఏ ఊరికి పోవాలన్నా ఉచితం అని చెప్పారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. గతేడాది ఎన్ని ఇచ్చారు. ఇప్పటి వరకు ఎన్ని ఇచ్చారు. ఆడబిడ్డ ధి పేరుతో నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్లలో ప్రతీ మహిళకు 36వేలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి కింద రెండేళ్లలో ఒక్కో నిరుద్యోగికి రూ.72వేలు బాకీ పడ్డారు. 50 ఏళ్లు దాటిన మహిళలకు గతేడాది 48వేలు, ఈ ఏడాది 48 వేలు పెన్షన్లకు ఎగనామం పెట్టారు. మేము దిగిపోయే నాటికి 66,34,742 మంది పెన్షన్ దారులు ఉన్నారు. ఇప్పుడు 61,91,864 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. ఇది మోసం కాదా? చంద్రబాబు అని అడుగుతున్నాను. పీఎం కిసాన్ కాకుండా అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామన్నారు. గతేడాది, ఈ ఏడాది కలిపి రైతులకు రూ.40వేలు బాకీపడ్డారు. తల్లికివందనం కింద 15వేలు ఇస్తామన్నారు. రూ.8వేలు, 9వేలు, 13వేలు ఇచ్చిన మాట వాస్తవం కాదా అని నిలదీసారు. ఇసుక దోపిడీ నడుస్తోంది. లిక్కర్ మాఫియా నడుస్తోంది. అమరావతి పేరిట మాపియా జరుగుతోంది. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం తగ్గుతోంది. చంద్రబాబు, ఆయన మాఫియాకు ఆదాయం పెరుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి కనిపిస్తోంది. ప్రజల జీవితాలు తగలబడుతుంటే.. రోమన్ చక్రవర్తి



నీరోలా చంద్రబాబు ఫిడేల్ వాయిస్తున్నారు. సూపర్‌సిక్స్ పేరిట బలవంతపు సంబురాలు చేయిస్తున్నాడు. రాష్ట్ర చరిత్రలో కనివినీ ఎరుగని అధ్యాయం ఇది. చంద్రబాబు హయాంలో అప్పులు ఎగబాకాయి అని చెప్పుకొచ్చారు. గత ఐదేళ్లలో ఇలా ఉండేదా ? మా పాలనలో రైతులు రోడ్డెక్కడం చూశారా... అని వైసిపి అధినేత వైఎస్.జగన్ ప్రశ్నించారు. తమ హయాంలో రైతులకు ఇబ్బంది అనేదే లేదు అని చెప్పారు. ఇలాంటి పరిస్థితికి.. చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలి అని విమర్శించారు. రెండు నెలలుగా రైతులు ఎరువులు దొరక్క అగచాట్లు- పడుతున్నారని, పగలు రాత్రి తేడా లేకుండా క్యూలైన్లలో నిలబడ్డారని అన్నారు. సిఎం సొంత జిల్లా.. ఆయన నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. సమయానికి ఎరువులు అందిస్తే రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దేనికని ప్రశ్నించారు. రైతులు యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతులకు అందాల్సిన ఎరువులు బ్లాక్‌మార్కెట్‌లో స్కాంలకు గురవుతున్నాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ.. రైతుల పక్షాన రైతులతో కలిసి ఆర్డీవోలకు అర్జీలు ఇచ్చే కార్యక్రమం చేశామన్నారు. వైసిపి కార్యక్రమాన్ని అడ్డుకుంటూ.. పోలీసులు అణగదొక్కే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. వైసిపి నేతలకు ఎక్కడికక్కడే నోటీసులు ఇచ్చారని తెలిపారు. రైతులకు మద్దతు ఇవ్వడం తప్పా చంద్రబాబూ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస బాధ్యతలు నిర్వహించడం లేదు అని మండిపడ్డారు.

# ట్రంప్ సుంకాలతో ఎదురుదెబ్బలు

## అమెరికన్ వ్యాపారవేత్తల ఆందోళన

**వాషింగ్టన్,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

ఆదాయం పెంచుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాలపై కొరడా ఝులిపిస్తే.. ఆ దెబ్బ అమెరికా కంపెనీలకే తగులుతోంది. దీంతో అక్కడి వ్యాపార కంపెనీలు లబోదిబోమంటున్నాయి. ఇది అమెరికాకు మేలు చేసేదెల ఉన్నా, ముందుగా తమ ఉనికికే ప్రమాదంగా మారిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. అగ్రరాజ్యానికి చెందిన మెజారిటీ- కంపెనీలు చైనా నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండటమే అందుకు కారణం. చైనా నుంచి అత్యధిక సుంకాలు వసూలు చేయాలని వాషింగ్టన్ భావించగా.. బీజింగ్ కూడా తాము తక్కువ తినలేదని ప్రతీకార సుంకాలు విధించింది. దీంతో అమెరికా కంపెనీలే ఎక్కువగా నష్టపోనున్నాయని షాంఘైలోని అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సర్వేలో తేలింది. ఈ సర్వేలో మొత్తం 254 కంపెనీల్లో మూడోవంతు పాల్గొన్నాయి. చైనాలో కొత్త సుంకాల వల్ల తాము అంచనా వేసిన ఆదాయం తగ్గుతుందని అవి పేర్కొన్నాయి. అయితే, బ్యాంకింగ్, కొన్నిరకాల ఇతర పరిశ్రమలు అమెరికా(÷ూఆ)కు ఎటు-వంటి ఎగుమతులు, దిగుమతులు చేయడం లేదు. ఇలాంటి కంపెనీలు దాదాపు మూడింట ఒక వంతు ఉన్నాయని తెలిసింది. వీటిపై మాత్రమే టారిఫ్‌ల భారం ఉండదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా దిగుమతులపై తొలుత అదనంగా 30 శాతం సుంకాలు విధించారు. తర్వాత వాటిని 145 శాతానికి పెంచారు. దీనిపై డ్రాగన్ కూడా దీటుగా స్పందించడంతో పరస్పర సుంకాలపై వెనక్కి తగ్గాలని ఇరు దేశాధినేతలు మేలో నిర్ణయించుకున్నారు. దీంతో చైనా 10 శాతం సుంకాలతో సరిపెట్టింది. నూతన టారిఫ్‌ల ప్రభావం చైనా నుంచి అమెరికాకు ఎగుమతులు చేసే కంపెనీలు, అగ్రరాజ్యం నుంచి కొన్ని రకాల ముడిసరకు దిగుమతి చేసుకొనే కంపెనీలపై పడింది. వీటిలో ముఖ్యంగా రసాయన కంపెనీలు ఉన్నాయని షాంఘై ఛాంబర్ లీడర్స్ తెలిపారు. సుంకాలు మా కార్యకలాపాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని ఆ బృంద అధ్యక్షుడు పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికా, చైనాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. సుంకాలు, ఇతర అంశాలపై ఏవిధంగా ముందుకెళ్తున్నారనే విషయంపై స్పష్టత రావడం లేదు. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన కంపెనీలకు ఈ అనిశ్చితి ఒక సవాలుగా మారిందని జెంగ్ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ చట్టాల ఆధారంగా సుంకాలు విధిస్తున్నారని, అవి చెల్లుబాటు కావని ఇప్పటికే పలు కోర్టులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా తీర్పునిచ్చాయి. ఈ తీర్పులపై ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# టిటిడి ఇవోగా సింఘాల్ బాధ్యతలు

## రంగనాయక మంటపంలో వేదాశీర్వచనం

**తిరుమల,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

టిటిడి ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన అలిపిరి మార్గంలో కాలినడకన తిరుమల చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ఈవోగా ప్రమాణం చేశారు. రంగనాయకుల మండపంలో ఆయనకు వేద పండితులు ఆశీర్వచనాలిచ్చారు. అనిల్ సింఘాల్‌కు అదనపు ఈవో వెంకయ్య చౌదరి శేషవస్త్రం కప్పి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ.. రెండోసారి ఈవోగా అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అని పేర్కొన్నారు. కాలినడక మార్గంలో వస్తున్నప్పుడు భక్తులు కొన్ని సమస్యలు దృష్టికి తెచ్చారని తెలిపారు. వాటిని పరిష్కరించి మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుమల పవిత్రతను కాపాడాలని సిఎం చంద్రబాబు నాయుడు తనకు సూచించారన్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. ఆయన సూచనల మేరకు తన సేవలను విస్తృతం చేస్తానని, సామన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇదిలావుంటే బదిలీ అయిన ఈవో శ్యామలరావుకు ఆలయ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ.. పూర్వ జన్మ సుకృతం ఉంటే తప్ప తితిదే ఈవోగా పనిచేసే భాగ్యం కలగదన్నారు. తనకు ఈవోగా పనిచేసే అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 14 నెలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు- చెప్పారు. రాబోయే 25 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా సంస్కరణలు, అభివృద్ధి చేపట్టినట్లు- వివరించారు. బోర్డు సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

# నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ

## తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

**హైదరాబాద్,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

నేపాల్‌లో అల్లర్లు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం అక్కడి పౌరులకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతానికి, ఏ తెలంగాణ పౌరుడికి గానీ గాయాలు లేదా అదృశ్యమైనట్లు ఎలాంటి నివేదికలు అందలేదు.అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, అలాగే కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, అక్కడ ఉన్న తమ పౌరుల భద్రతను, అలాగే వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.సహాయం కోసం తెలంగాణ పౌరులు ఈ క్రింది అధికారులను సంప్రదించవచ్చునిసూచించింది. ప్రైవేట్ సెక్రటరీ, రెసిడెంట్ కమిషనర్ లైజన్ హెడ్ వందన. ఫోన్: 91 9871999044. లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ ఫోన్: 91 9643723157.పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సిహెచ్. చక్రవర్తి.. ఫోన్: 91 9949351270. పౌరులందరూ అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తన ప్రజల భద్రత, సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సందర్భంగా పేర్కొంది.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేం

## నివాళి అర్పించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన విప్లవ నిప్పుకణిక ఐలమ్మ, భూమి కోసం, భుక్తి కోసం తిరుగుబాటు- చేసి ప్రజా వ్యతిరేక పాలనపై దండెత్తిందని గుర్తుచేశారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెను కేటీ-ఆర్ స్మరించుకున్నారు. చాకలి ఐలమ్మ పోరాటాలను, త్యాగాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిందని కేటీ-ఆర్ తెలిపారు.

# అనంత సభ సూపర్ సక్సెస్

## వైకాపా దుష్ప్రచారం పనిచేయలేదు

### మంత్రి లోకేశ్ వ్యాఖ్య

**అమరావతి,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

అనంతపురంలో నిర్వహించిన 'సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్' విజయోత్సవ సభపై 'జె గ్యాంగ్' చేసిన వ్యతిరేక ప్రచారం ఏ మాత్రం ప్రభావం చూపించలేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయోత్సవ సభకు వస్తేనే సంక్షేమ పథకాలు ఇస్తామని సమీప గ్రామాల్లో ప్రభుత్వం తరఫున చాటింపు వేయించినట్లు- వైకాపా నాయకులు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కల్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం అచ్చంపల్లిలో వైకాపా నేతలే ఈ కుట్రకు తెరలేపి ఒక వీడియో ప్రచారం చేశారని చెప్పారు. ఈ దుష్ప్రచారంపై వాస్తవాలు ఏంటని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. వైకాపా నేతలు వారి పార్టీకి చెందిన ఓ కార్యకర్తతో దండోరా వేయించి ఆ వీడియోని సోషల్‌మీడియాలో పోస్టు చేసి ప్రచారం చేసినట్లు- వెల్లడైందని మంత్రి తెలిపారు. డ్వాక్రా మహిళలకు సమావేశానికి రాకపోతే జరిమానా విధిస్తారనే తప్పుడు ప్రచారం కోసం ఒక ఆడియోను సోషల్‌మీడియాలో పోస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు చైతన్యవంతులయ్యారని, వైకాపా ఆటలు ఇక సాగవని అన్నారు.

# నేపాల్‌లో చిక్కుకున్న భారత పర్యాటకులు

## పర్యాటకులను కూడా వదలని ఆందోళనకారులు

**ఖాట్మండ్,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

నేపాల్‌లో జెన్-జడ్ నిరసనలు హింసాత్మక పరిస్థితులను సృష్టించాయి. ప్రభుత్వ, ప్రైవేటు- ఆస్తులకు ఆందోళనకారులు నిప్పటించారు. పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్ పైనా వారు దాడికి దిగారు. దాంతో అందులో బస చేస్తోన్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ తనకు సహాయం చేయాలంటూ భారత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. దానికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఉపాసన గిల్ వాలీబాల్ లీగ్ కోసం నేపాల్ వచ్చారు. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హోటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెనకే దూసుకొచ్చారని గిల్ వాపోయారు. వారినుంచి ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్న ఆమె.. సహాయం కోసం భారత ప్రభుత్వాన్ని అర్థించారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవని, రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తున్నాయని వెల్లడించారు. వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగలబెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు- చాలామంది సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇక ఇప్పటికే నేపాల్ లో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారంతా తమ పర్యటనను అర్ధంతరంగా ముగించుకొన్నారు. ఇదిలాఉంటే.. చర్చల ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్షుడు, ఆర్మీ నిరసనకారులను కోరింది. ప్రస్తుతం అక్కడ ఆర్మీ కర్ఫ్యూ ప్రకటించింది. నేపాల్ వెంబడి ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో భారత్ భద్రతను కట్టుదిట్టం చేసింది.

# కనిపించకుండా పోయిన మాజీ ప్రధాని ఓలి

## రాజీనామా చేసిన ఓలి ఆచూకీ తెలియదన్న ఆర్మీ

**ఖాట్మండ్,సెప్టెంబర్10(సమయ జ్యోతి ):**

జెన్-జెడ్ ఉద్యమానికి తలొగ్గి నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా చేశాక, 24 గంటలు గడుస్తున్నా ఓలి ఆచూకీ మాత్రం ఇప్పటి వరకు లభించలేదు. ఆయనను లక్ష్యంగా చేసుకుని నిరసనకారులు ఏమైనా దాడి చేశారా, లేదంటే దుబాయ్‌కి పారిపోయారా? అన్నది ఇంకా తెలియలేదు. దీనిపై సైన్యం కూడా స్పష్టత ఇవ్వలేదు. ఓలి సమాచారం తమకు కూడా తెలియదని సైన్యం వెల్లడించింది. దీంతో ఆయన ఎక్కడ ఉన్నారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. క్షేమంగానే ఉన్నారా? లేదంటే దుబాయ్ వెళ్లిపోయారా అన్న చర్చ నడుస్తోంది. అయితే ఓలి రాజీనామా చేశాక అజ్ఞాతంలోకి వెళ్లారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే భద్రతా కారణాల దృష్ట్యా నేపాల్ సైన్యం ఓలిని తన ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చిందని ఖాట్మండు నుంచి నివేదికలు అందాయి. కానీ ఆయన ఎక్కడున్నారన్న విషయం మాత్రం వెల్లడించలేదు. అయితే ఓలి మయన్మార్ రాజధాని నేపిడాకు పారిపోయినట్లు మరిన్ని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ పుకార్లేనని సైన్యం కొట్టిపారేస్తోంది. సైన్యం ఇంకా అధికారింగా నిర్ధారించలేదు. కేపీ శర్మ ఓలి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం రణరంగంగా మారింది. సోమ, మంగళవారాల్లో జరిగిన విధ్వంసానికి నేపాల్ రాజధాని ఖాట్మండు అతలాకుతలం అయిపోయింది. ప్రభుత్వ భవనాలు, కార్లు, ఆస్తులను నిరసనకారులు ధ్వంసం చేశారు. ఇక మాజీ ప్రధాని ఇంటికి నిప్పుపెట్టడంతో మాజీ ప్రధాని ఝలనాథ్ ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రాకార్ సజీవ దహనం అయ్యారు. ఇక మంత్రులనైతే పరిగెత్తించి కొట్టారు. ఇక పరిస్థితులు చేదాటిపోవడంతో కేపీ శర్మ ఓలి(73) ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం సైన్యం పరిపాలనను అదుపులోకి తీసుకుంది. కర్ఫ్యూ సెప్టెంబర్ 11, సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటుందని సైన్యం వెల్లడించింది. ఇక దోపిడీ, అల్లర్లకు పాల్పడుతున్న 26 మందిని అరెస్ట్ చేసినట్లు- సైన్యం ప్రకటించింది. నిరసనల పేరుతో నేర కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. కొందరు లైంగిక దాడులకు కూడా పాల్పడుతున్నారని వివరించింది. దయచేసి పౌరులంతా సహకరించాలని సైన్యం ఒక ప్రకటనలో కోరింది.



# అన్నదాతకు తప్పని యూరియా కష్టాలు





### బస్తా కోసం ఉదయం నుండి రాత్రి వరకు క్యూ లైన్

**వీణవంక, సెప్టెంబర్ 10(సమయ జ్యోతి)**

దేశానికి అన్నంపెట్టే రైతన్నకు ఆరుగాలం పండించాల్సిన పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం యూరియా పంపిణీ చేయలేక రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు.ఓ వైపు చేతికిచ్చే పంటలను చూసుకోవాలో లేక యూరియా వస్తుందని సొసైటీల చుట్టూ పడిగాపులు కాయలో తెలియడం లేదని రైతులు మండి పడుతున్నారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రం లోని పీఏ సీ ఎస్ సొసైటీ వద్ద యూరియా వచ్చిందనే సమాచారం తో మండల కేంద్రం లోని నూతన సహకార సంఘం వద్ద బుధవారం తెల్లవారు జామునుండే రైతులు ఆఫీసు వద్ద కు చేరుకొని ఆధార్ కార్డులు క్యూ లైన్ లో పెట్టి అధికారుల కోసం వేచి చూశారు. అధికారులను వివరణ కోరగా వచ్చిన 420 యూరియా బస్తాలను నర్సింగాపూర్, వీణవంక, రామకృష్ణాపూర్, కనపర్తి, బ్రహ్మణపల్లి, కనపర్తి, పోతిరెడ్డిపల్లి, మల్లనపల్లి, వల్బపూర్ గ్రామాలకు సరి చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. క్యూ లైన్ లో ఉన్న వారికి ఒక్కో ఆధార్ కార్డు పై ఒక్కో యూరియా బస్తా ఇస్తామని తెలిపారు. రైతులు కార్యాలయం వద్ద క్యూలైన లో గందరగోళం ఏర్పడం తో పోలీ సులు చేరుకున్నారు.

### పోలీసుల పహారా లో యూరియా పంపిణి

బుధవారం రోజు స్థానిక మండలం లోని సొసైటీ కార్యాలయం వద్ద పెద్ద మొత్తం లో రైతులు చేరుకున్నారు.ఆధార్ కార్డు లతో క్యూ లైన్ లో టోకెన్ల కోసం తీవ్ర ఉద్రిక్తత నెలకొనడం తో క్షేత్ర స్థాయిలో ఎస్సై ఆవుల తిరుపతి తన సిబ్బంది తో ఇటు కార్యాలయం వద్ద నర్సింగాపూర్ గోదాం వద్దకు సిబ్బంది ఏర్పాటు చేసి రైతులకు గ్రామాల వారిగా యూరియా బస్తాలను పంపిణీ చేశారు.

# ఓదెల దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్





### ఆలయానికి 500 మీటర్ల పరిధిలో రియల్ ఎస్టేట్ నిషేధం

**పెద్దపల్లి సెప్టెంబరు 10 (సమయ జ్యోతి**

పెద్దపల్లి జిల్లా ఓదెల శ్రీ.మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో బుధవారం రోజున ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తదుపరి ఆలయ అభివృద్ధి కోసం తీసుకునే చర్యల్లో భాగంగా ఆలయ పరిసరాలను పరిశీలించరు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ నెలరోజుల్లోగా ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయం పరిసరాలలో 500 మీటర్ల లోపు భూములలో నిర్మాణాలు గానీ, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు గాని చేయరాదన్నారు. ఆలయ భవిష్యత్తు అవసరాల కోసం అందరు సహకరించాలని కోరారు. జిల్లాలోని ఈ అతిపెద్ద ఆలయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే డబుల్ రోడ్డు నిర్మిస్తున్నామని, ఆలయ ప్రిన్సెస్ లో రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ డివైడర్ లను నిర్మిస్తామన్నారు. ఓదెల ఆలయానికి సంబంధించి అన్ని రకాల టికెట్లను ఇక ఆన్లైన్లో విక్రయించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఒగ్గు పూజారుల కోసం ఆలయ టికెట్లపై ఆదాయాన్ని 25 శాతం నుండి 35 శాతానికి పెంచి అందించనున్నట్టు చెప్పారు. ఆలయ అభివృద్ధికి పూర్తి పారదర్శకతో పని చేయాలని ఆయన పాలకమండలికి సూచించారు. ఆలయ అభివృద్ధికి పూర్తి వ్యవస్థీకృత చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తాను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నట్టు తెలిపారు. పొత్కపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో బుధవారం రోజున ఓదెల మండలం కొలనూరు గ్రామంలో ఫర్టిలైజర్ గోదాముకు ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించరు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొలనూరు గ్రామంలో ఫర్టిలైజర్ గోదామును ప్రారంభించుకోవడం జరిగిందని అలాగే రైతులకు యూరియా అందడం లేదని బిఆర్ఎస్ నాయకులు చెప్పులు లైన్ లో పెడుతూ రైతులను, ప్రజలను మభ్యపెడుతున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో ఆ పార్టీ నాయకులకు కర్రు కాల్చి వాత పెడతారని అన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి రైతులకు యూరియా అందించాలని అన్నారు. బిజెపి 8 మంది ఎంపిలు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారితో కొట్లాడి రాష్ట్ర రైతంగానికి యూరియాను అందించాలని కోరారు అలాగే రైతులకు విజ్ఞప్తి పంటలకు నానో యూరియా వాడితే మంచి ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. నానో యూరియా వల్ల మొక్కలపై పిచికారీ చెయ్యడం వల్ల చీడ పురుగులు వివరించవచ్చని అన్నారు. స్థానిక సంస్థలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరేలా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్య,ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి,గోపు నారాయణ రెడ్డి,ఢిల్లీ శంకర్,బైరి రవి,మల్లన్న,జై పాల్ రెడ్డి,గుండేటి ఐలయ్య మరియు సింగిల్,మార్కెట్ డైరెక్టర్లు మరియు రైతులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# నేపాల్‌లో చిక్కుకున్న వారి కోసం ఆరా

### అధికారులతో సమీక్షించిన మంత్రి లోకేశ్

### అనంత పర్యటన రద్దు చేసుకుని ఇక్కడే మకాం

**అమరావతి,సెప్టెంబర్10 (సమయ జ్యోతి ):**

మంత్రి నారా లోకేశ్ అనంతపురం పర్యటన రద్దయ్యింది. నేపాల్‌లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో అక్కడ ఉన్న ఆంధ్రులను సురక్షితంగా ఏపీకి తీసుకురావడంపై దృష్టి సారించడంతో తన పర్యటనను రద్దు చేసుకున్నారు. అనంతపురంలో సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభకు ఏపీ సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో నారా లోకేశ్ కూడా ఈ సభ కోసం అనంతపురం వెళ్లాల్సి ఉంది. కానీ నేపాల్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడ ఉన్న ఏపీవాసులను రాష్ట్రానికి తీసుకురావడంపై నారా లోకేశ్ దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని అమరావతి సచివాలయంలోని రియల్ -టైమ్ గవర్నెన్స్ సెంటర్‌కు ఆయన వెళ్లారు. అందులో ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక వార్ రూమ్‌లో సంబంధిత ఆర్టీజీఎస్ అధికారులతో కలిసి నారా లోకేశ్ సమన్వయం చేస్తున్నారు. ప్రత్యేక కాల్ సెంటర్, వాట్సాప్ నంబర్ ఏర్పాటు- చేసి పరిస్థితిని, నేపాల్‌లో చిక్కుకున్న వారి వివరాలను సేకరించనున్నారు. దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో వారిని తక్షణమే రాష్ట్రానికి తీసుకురానున్నారు.మంగళగిరి వాసులు నేపాల్ రాజధాని ఖాట్మండులో చిక్కుకుపోయిన ఘటనపై స్పందించారు. ప్రస్తుతం పశుపతి ఫ్రంట్ హోటల్‌లో 8 మంది మంగళగిరి వాసులు తలదాచుకుని ఉన్నారు. బాధితులు మాచర్ల హేమ సుందర్ రావు, దామర్ల నాగలక్ష్మితో మంత్రి నారా లోకేష్ వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. బాధితులు తాము ప్రయాణిస్తున్న బస్సుపై ఆందోళనకారులు దాడి చేసినట్లు- తెలిపారు. ప్రస్తుతం వారి వద్ద మరో 40 మంది తెలుగువాసులు కూడా తలదాచుకున్నారని తెలిపారు. ఈ విషయమై.. ఖాట్మండు ఎయిర్ పోర్టుకు కిలోమీటర్ల దూరంలోనే మీరు తలదాచుకున్న హోటల్ ఉంది. ఆందోళన చెందవద్దు, తాము క్షేమంగా రాష్ట్రానికి తీసుకువస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంగళగిరివాసులతో పాటు- రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు కూడా టచ్‌లో ఉంటారని లోకేష్ తెలిపారు. ఈ కేసుపై ఎపి భవన్ అధికారి అర్జా శ్రీకాంత్, రాష్ట్రానికి చెందిన సీనియర్ అధికారులు కార్తికేయ మిశ్రా, ముఖేష్ కుమార్ మీనా, కోన శశిధర్, అజయ్ జైన్, హిమాన్షు శుక్లా, జయలక్ష్మిలతో కలిసి మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం.. మొత్తం 241 మంది తెలుగు వాసులు నేపాల్‌లో చిక్కుకుపోయారని అధికారులు మంత్రి లోకేష్‌కు వివరించారు. ఇందుకు సంబంధించి నేరుగా భారత విదేశాంగ శాఖ అధికారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, సాధ్యమైనంత త్వరగా నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ వాసులను రక్షించి రాష్ట్రానికి తీసుకురావాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు.

# బంగారం ధరలు మరింత పైపైకి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్10(సమయ జ్యోతి )**

:బంగారం కొనాలనుకునే వారికి వరుసగా షాక్ తగులుతోంది. బంగారం ధర ఆల్-టైమ్ గరిష్టానికి చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 10, 300కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 01, 100కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు- 10 గ్రాములకు రూ. 1, 10, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 01, 260కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 10, 300కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు- రూ. 1, 01, 100కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లలో స్వల్ప మార్పులు ఉన్నా పెద్దగా తేడాలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# టీమిండియా జట్టు అంచనా

అభిషేక్ శర్మ, శుభమన్ గిల్ , తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దుబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ / సంజూ శాంసన్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్.



# పృథ్వీ షాకు కోర్టు జరిమానా



టీమిండియా క్రికెటర్ పృథ్వీ షాకు ముంబై కోర్టు షాకిచ్చింది. ముంబైలోని డిండోషి సెషన్స్ కోర్టు క్రికెటర్‌కు రూ.100 జరిమానా విధించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సప్నా గిల్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించని కారణంగా, బదులు ఇవ్వకపోవడంతో కోర్టు చర్యలు చేపట్టింది. కోర్టు గతంలో పృథ్వీ షాకు కౌంటర్ దాఖలు చేయడానికి చివరి అవకాశం ఇచ్చింది. అయినప్పటికీ అతని నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఫిబ్రవరి 2023న పృథ్వీ షా, సప్నా గిల్ మధ్య వివాదం జరిగింది. ముంబైలోని అంధేరి ప్రాంతంలోని ఒక పబ్లో పృథ్వీ షా, సప్నా గిల్ గొడవ పడ్డారు.

# ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ సిక్సర్ల వర్షం!



ఆసియా కప్ 2025 ప్రారంభానికి ముందు, యువ బ్యాటర్ అభిషేక్ శర్మ నెట్ సెషన్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. గంటపాటు సాగిన ప్రాక్టీస్‌లో 25 - 30 సిక్సర్లు బాదినట్లు సమాచారం. యూఏఈతో జరిగే తొలి మ్యాచ్‌లో దూకుడుగా ఆడాలనే సంకేతాలను టీమిండియా పంపింది. సూర్యకుమార్ యాదవ్ కూడా తమ వ్యూహాన్ని స్పష్టం చేశాడు. ఈరోజు రాత్రి భారత్, యూఏఈ తలపడనున్నాయి. తుది జట్టులో ఆల్‌రౌండర్లకు ఎక్కువ అవకాశం ఉంటుందని తెలుస్తోంది.ఆసియా కప్ 2025 ఆరంభ మ్యాచ్‌కు ముందే టీమిండియా యువ బ్యాటర్ అభిషేక్ శర్మ తన దూకుడు ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆప్షనల్ నెట్ సెషన్‌లో అభిషేక్ ఒక్క గంటపాటు సాగిన బ్యాటింగ్‌లో 25 నుంచి 30 సిక్సర్లు బాదాడు. బౌండరీ బయటకు టార్గెట్‌గా పెట్టుకుని నెట్ ప్రాక్టీస్‌ను పూర్తిగా రేంజ్ హిట్టింగ్ ఎగ్జిబిషన్‌లా మార్చేశాడు.ఈ ప్రాక్టీస్ సెషన్‌లో సీనియర్లలో కొందరు విశ్రాంతి తీసుకున్నా, యాభై సిక్సర్లతో స్పాట్‌లైట్ మొత్తాన్ని తన వైపు తిప్పుకున్నాడు అభిషేక్. యూఏఈపై తొలి మ్యాచ్‌కు ముందు టీమిండియా లక్ష్యమేంటో అభిషేక్ నెట్ సెషన్‌తో చెప్పేసింది. స్కిప్పర్ సూర్యకుమార్ యాదవ్ కూడా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తన దూకుడు యత్నాలపై స్పష్టతనిచ్చాడు. అందుకోసమే అభిషేక్ శర్మ ప్రాక్టీస్ సెషన్‌లో జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి బౌలర్లను ఎదుర్కొంటున్నాడు."అగ్రెషన్ లేకుండా ఈ ఆట ఆడటం అసంభవం. మేము మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు ఎప్పుడూ అగ్రెషన్‌తోనే ఉంటాం. నేను కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నాను.. ఫ్రంట్‌ఫుట్‌లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నాం" అని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ఈ రోజు రాత్రి దుబాయ్ వేదికగా భారత్ - యూఏఈ మధ్య మ్యాచ్ జరగనుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందే టీమిండియా తన వ్యూహం చెప్పేసింది. కేవలం హిట్టింగే టార్గెట్‌గా భారత్ బరిలోకి దిగే అవకాశం ఉంది. అందుకోసమే ప్లేయింగ్ 11లో కూడా ఆల్‌రౌండర్లకే ఎక్కువ ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎనిమిదో స్థానం వరకూ బ్యాటింగ్ ఆడించాలి అని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చూస్తున్నాడు. అభిషేక్ శర్మతో పాటు ఓపెనింగ్ దిగేది ఎవరు అనేదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారనుంది. సంజూ శాంసన్‌కు అవకాశం ఇస్తారా? లేక శుభమన్ గిల్‌ను పంపిస్తారా? అనే దానిపై క్లారిటీ లేదు. ఎనిమిదో స్థానం వరకూ ఆడాలంటే జితేశ్ శర్మని జట్టులో తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు. మొత్తానికి భారత్ ప్లేయింగ్ 11లో ఎవరు ఉంటారనే దాని కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆసియా కప్ లో ఆఫ్ఘానిస్థాన్ బోణీ



ఆసియా కప్ లో ఆఫ్ఘానిస్థాన్ శుభారంభం చేసింది. మంగళవారం టోర్నీ ఓపెనర్ గా హాంకాంగ్ తో జరిగిన మ్యాచ్ లో 94 పరుగులతో విజయం సాధించింది. అబుదాభిలోని షేక్ జయేద్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆఫ్గాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 188 పరుగులు చేసింది. ఓపెనర్ సాదిఖుల్లా అటల్ స్టన్నింగ్ అజేయ ఫిఫ్టీ (52 బంతుల్లో 73 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో ఆయుష్ శుక్లా, కించిత్ షాకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం భారీ ఛేజింగ్ లో బరిలోకి దిగిన హాంకాంగ్.. ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లకు 94 పరుగులు మాత్రమే చేసి, 94 పరుగులతో పరాజయం పాలైంది. బాబర్ హయాత్ (39) టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఫజల్ హక్ ఫరూఖీ, గుల్బదిన్ నయిబ్ రెండేసి వికెట్లతో హాంకాంగ్ పతనాన్ని శాసించారు. దీంతో గ్రూప్-బిలో తొలి విజయాన్ని ఆఫ్గాన్ దక్కించుకున్నట్లయ్యింది. టోర్నీలో తర్వాతి మ్యాచ్ బుధవారం ఆతిథ్య యూఏఈ, ఇండియా మధ్య జరుగుతుంది.టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆఫ్గాన్ కు శుభారంభం దక్కలేదు. ఆరంభంలోనే విధ్వంసక రహ్మానుల్లా గుర్బాజ్ (8), ఇబ్రహీం జద్రాన్ (1) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో వెటరన్ మహ్మద్ నబీ (33) తో కలిసి అటల్ ఇన్నింగ్స్ ను నిర్మించాడు. వీరిద్దరూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు కొడుతూ, వేగంగా పరుగులు జత చేశారు. మూడో వికెట్ కు 51 పరుగులు జతయ్యాక నబీ ఔటయ్యాడు. నయిబ్ (5) విఫలమైనా, అజ్మతుల్లా ఒమర్జాయ్ (21 బంతుల్లో 53, 2 ఫోర్లు, 5 సిక్సర్లు) తో కలిసి అటల్ ఆఫ్గాన్ కు భారీ స్కోరు అందించాడు. స్లాగ్ ఓవర్లలో వీరిద్దరూ సిక్సర్లతో రెచ్చిపోవడంతో ఆఫ్గాన్ అనుకున్నదానికంటే భారీ స్కోరు సాధించింది. భారీ టార్గెట్ ను చూసి బెంబేలెత్తిపోయిన హాంకాంగ్ చేతులెత్తేసింది. పేరుకు హాంకాంగ్ టీమ్ అయినప్పటికీ, మెజారిటీ ఇండియా, పాక్ సంతతి ప్లేయర్లే ఈ జట్టు తరపున ఆడుతున్నారు. అయితే ఆఫ్గాన్ కట్టుదిట్టమైన బౌలింగ్ కు వీరివద్ద సమాధానం లేకుండా పోయింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతూ, మ్యాచ్ ను ఎప్పుడో ఆఫ్గాన్ కు అప్పగించింది.బాబర్ కాస్త పోరాటం చేయడంతో వంద పరుగుల మార్కు దగ్గరగా వెళ్లింది. ఈ ఫలితంతో ఆఫ్గాన్ కు ఈ టోర్నీలో తొలి విజయాన్ని సాధించింది. బౌలింగ్ లో ఒక వికెట్ తీసి, అర్ధ సెంచరీ చేసిన ఒమర్జాయ్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# బీసీసీఐకి ఉత్తరాఖండ్ హైకోర్టు నోటీసులు



ఉత్తరాఖండ్ హైకోర్టు బీసీసీఐకి మంగళవారం నోటీసులిచ్చింది. ఆ రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.12 కోట్లను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ దుర్వినియోగం చేసిందనే ఆరోపణలపై దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించిన హైకోర్టు బీసీసీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? ఆడిట్ రిపోర్ట్? ఆధారంగా ఆటగాళ్లకు అరటిపండ్ల కోసం రూ.35 లక్షలకు ఖర్చు చేశారని పిటిషనర్ ఆరోపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? అకౌంట్స్?పై దర్యాప్తు కోరుతూ డెహ్రాడూన్?కు చెందిన సంజయ్ రావత్ సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? ఆడిట్ రిపోర్ట్?ను హైలైట్ చేస్తూ, అందులో ఖర్చులు చూసి షాక్?కు గురైనట్లు పేర్కొన్నారు. కేవలం ప్లేయర్లకు అరటిపండ్లు అందించేందుకే రూ.35 లక్షలు ఖర్చైనట్లు ఆడిట్ రిపోర్ట్?లో ఉన్నట్లు తెలిపారు. అందుకే ఆ రాష్ట్ర క్రికెట్ బోర్డు ఆడిట్ రిపోర్ట్?పై దర్యాప్తు చేపట్టాలని పిటిషన్?లో పేర్కొన్నారు. క్రికెట్ డెవలప్?మెంట్ కోసం కేటాయించిన ఆ నిధులను, కొందరు వ్యక్తిగత బెనిఫిట్ కోసం దుర్వినియోగం చేశారని అన్నారు. ఆహార ఖర్చుల ముసుగులో అసోసియేషన్ కోట్లు స్వాహా చేసిందని, రాష్ట్ర ఆటగాళ్లకు తగిన సౌకర్యాలు ఎప్పుడూ కల్పించలేదని పిటిషనర్లు ఆరోపించారు. కాగా, సింగిల్ బెంచ్ జస్టిస్ మనోజ్ తివారి ఈ పిటిషన్లపై వాదనలు విన్నారు. ఇక ఈ ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. రాష్ట్ర క్రికెట్ బోర్డు నిర్వహించే టోర్నమెంట్?లకు కూడా బోర్డు భారీగా ఖర్చు చేసిందని ఆరోపించారు. ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా, రూ.6.4 కోట్లు ఈవెంట్ మేనేజ్?మెంట్ ఫీజులు, రూ.26.3 కోట్లు టోర్నమెంట్ల నిర్వహణ, ట్రైయల్ మ్యాచ్?లు ఇతరత్రా అవసరాలకు ఖర్చు అయ్యింది. అయితే గతేడాది ఈ ఖర్చు రూ. 22.30 కోట్లే ఉంది. కాగా, ఇదే నెల 5న బోర్డుకు సంబంధించి మరో పిటిషన్? హైకోర్టుకు ముందుకు వచ్చింది. 2025 సీజన్?కు సంబంధించి ఉత్తరాఖండ్ ప్రీమియర్ లీగ్?లో టెండర్ల వ్యవహారంపైనా కోర్టులో వాదనలు జరిగాయి. టెండర్ల ప్రక్రియ సరైన విధానంలో జరగడం లేదని, కావాలని ఒకే కంపెనీకి టెండర్లు దక్కేలా చేస్తున్నారని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? ఉపాధ్యక్షుడు సురేంద్ర బండారి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్?పై స్పందించిన హైకోర్టు దీనిపై తమ సమాధానం తెలపాలని జస్టిస్ నరేందర్, జస్టిస్ సుభాష్ బెంచ్ బీసీసీఐ, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్? బోర్డు అధికారులకు నోటీసులు పంపించింది.



# ఓ క్రికెటర్ నగ్న ఫోటో పంపించాడు

## అనయ సంచలన ఆరోపణలు

టీమిండియా మాజీ ఆటగాడు సంజయ్ బంగర్ కుమారుడు ఆర్యన్ అమ్మాయిగా మారిన విషయం తెలిసిందే. తన పేరును అనయగా మార్చుకున్నాడు . అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్ నిర్వహిస్తున్న 'రైజ్ అండ్ ఫాల్' షోలో తను సంచలన విషయాన్ని వెల్లడించింది. తనకు ఓ క్రికెటర్ నగ్న ఫోటో పంపినట్లు తెలిపింది. నేను నవంబర్‌లో అబ్బాయి నుంచి అమ్మాయిగా మారి బహిరంగంగా బయటకు వచ్చాను. డిసెంబర్-జనవరి నాటికి నేను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాను. నా మనసులో ఏముందో దాన్ని పోస్ట్ చేస్తున్నాను. ఒక క్రికెటర్ నాతో మాట్లాడటం ప్రారంభించాడు అని అనయ అన్నారు. అతను ఆ రకమైన ఫోటోను డైరెక్ట్‌గా పంపించాడు అని అనయ చెప్పింది. 'ఏ రకమైన ఫోటో? నగ్న ఫోటో?' అని ఆ షోలో పాల్గొన్న మరో వ్యక్తి అడిగాడు. దీనికి అనయ 'అర్థం చేసుకోండి' అని చెప్పింది. మరొక వ్యక్తి 'ఆ క్రికెటర్ అందరికీ తెలుసా?' అని అడిగినప్పుడు అనయ 'అందరికీ అతన్ని తెలుసు' అని చెప్పింది. ఇది విని అందరూ షాక్ అయ్యారు. అనయకు నగ్న ఫోటో పంపిన క్రికెటర్ ఎవరు అనేది ఇప్పుడు అందరినీ వేధించే ప్రశ్నగా మారింది.

# పండంటి బిడ్డకు జన్మనిచ్చిన లావణ్య త్రిపాఠి

నటుడు వరుణ్ తేజ్,లావణ్య త్రిపాఠి దంపతులు తల్లిదండ్రులు అయ్యారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో లావణ్య త్రిపాఠి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు చిరంజీవి కూడా 'మన శంకరవరప్రసాద్‌గారు' సెట్స్ నుంచి నేరుగా ఆసుపత్రికి వెళ్లి వరుణ్, లావణ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. తాము తల్లిదండ్రులం కానున్నట్లు- వరుణ్ తేజ్ మేలో సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను. కమింగ్ సూన్' అనే క్యాప్షన్‌తో శుభవార్తను పంచుకున్నారు. తాజాగా వీరికి బాబు పుట్టడంతో మెగా ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. సెలబ్రిటీ-లు ఈ జంటకు విషెస్ చెబుతున్నారు. లావణ్య త్రిపాఠిని వరుణ్ తేజ్ ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. 2017లో 'మిస్టర్' సినిమా కోసం వరుణ్ - లావణ్య తొలిసారి కలిసి నటించారు. అప్పుడే ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. 2023 నవంబర్ 1న ఇటలీలోని టస్కానీ వేదికగా వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు.



# కొత్త లోక హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శి

## చిత్ర విజయంతో సూపర్ ఫీమేల్ హీరోగా ప్రశంసలు




'లోక చాప్టర్ 1: చంద్ర' తెలుగులో కొత్త లోకగా విడుదలై మంచి ఆదరణ తెచ్చుకుంది. ఇప్పటికే 200 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రంతో థియేటర్లలో కల్యాణి ప్రియదర్శన్ సందడి చేస్తున్నారు. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్  నిర్మించిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ రూ.కోట్లు- వసూలు చేస్తోంది. దీనిపై కల్యాణి ప్రియదర్శన్ ఆనందం వ్యక్తంచేశారు. దేశంలోనే మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమాలో నటించడం గర్వంగా ఉందన్నారు. మలయాళంలో 'లోక చాప్టర్ 1: చంద్ర' భారీ విజయం సాధించిన దగ్గర నుంచి అందరూ నన్ను ఫీమేల్ సూపర్ హీరో అని పిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేసింది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమా విజయం సాధించడానికి నాతో పాటు- మా టీమ్‌లోని వారంతా కష్టపడ్డారు. ఈ సక్సెస్ క్రెడిట్ వాళ్లకు కూడా వెళ్తుంది. నేను ఈ చిత్రానికి సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని మాత్రమే ఆలోచించాను. చిత్రీకరణ చేసే సమయంలోనే ఇది కచ్చితంగా విజయం సాధిస్తుందని అర్థమైంది. ఈ సినిమా మొత్తాన్ని నేను భుజాలపై వేసుకొని మోసానంటూ ప్రేక్షకులు నన్ను అభినందిస్తున్నారు. కానీ, మా టీమ్‌లో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ దీనికోసం కష్టపడ్డారు. 'లోక చాప్టర్ 1: చంద్ర' మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రల్లోనైనా చేయగలరు అని అందరికీ నమ్మకం కలిగిందని కల్యాణి ప్రియదర్శన్ చెప్పారు. డామినిక్ అరుణ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దుల్కర్ దీన్ని రూ.30 కోట్లతో నిర్మించగా.. ఇప్పటివరకూ రూ.200కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అత్యధిక వసూలు సాధించిన నాలుగో మలయాళ చిత్రంగా నిలిచిందని పేర్కొంది.

# వివాదంలో నయనతార డాక్యుమెంటరీ


## చంద్రముఖి క్లిప్స్ వాడకంపై మద్రాస్ హైకోర్టు నోటీసులు

లేడి సూపర్‌స్టార్ నయనతార మరోసారి వివాదంలో చిక్కుకుంది. ఆమె నటించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీటేల్ ' ఇప్పటికే పలు వివాదాలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తమ అనుమతి లేకుండా 'నానుమ్ రౌడీ దాన్' సినిమా క్లిప్‌లను ఉపయోగించారని ఆ సినిమా నిర్మాత ధనుష్ అప్పట్లో నయనతారపై రూ. 10 కోట్ల పరువు నష్టం దావా వేశాడు. అయితే ఈ వివాదం ముగియకముందే తాజాగా మరో కేసులో ఇరుక్కుంది నయన్. ఈ డాక్యుమెంటరీలో తమ అనుమతి లేకుండా 'చంద్రముఖి' సినిమాలోని క్లిప్‌లను ఉపయోగించారంటూ 'ఏపీ ఇంటర్నేషనల్' అనే సంస్థ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చంద్రముఖి' సినిమా హక్కులు తమ వద్ద ఉన్నాయని, తమ అనుమతి లేకుండా డాక్యుమెంటరీలో ఆ సినిమా క్లిప్‌లను వాడారని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై నయనతార, నెట్‌ఫ్లిక్స్‌కు రూ. 5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ వివాదంపై సమాధానం ఇవ్వాలని నయనతార, నెట్‌ఫ్లిక్స్‌లకు నోటీసులు జారీ చేసింది. దీనిపై అక్టోబర్ 6 లోపు స్పష్టత ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కాగా ఈ రెండు వివాదాలతో నయనతార డాక్యుమెంటరీ ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తమ అనుమతి లేకుండా ఆ డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సన్నివేశాలు ప్రదర్శించడంపై నిర్మాణ సంస్థ 'ఏబీ ఇంటర్నేషనల్' మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. దీనిపై అక్టోబరు 6లోపు సమాధానమివ్వాలని డాక్యుమెంటరీని నిర్మించిన 'టార్క్ స్టూడియోస్'కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఆ సన్నివేశాలను తొలగించాలని, రూ.5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినా తమ కంటెంట్‌తో డాక్యుమెంటరీ ప్రసారం అవుతూనే ఉందని ఏబీ ఇంటర్నేషనల్ పిటిషన్‌లో పేర్కొంది.



# మిరాయ్‌లో ట్రైన్ సీక్వెన్స్ ఓ పెద్ద అనుభూతి

తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిరాయ్' రితికానాయక్ కథానాయిక. మంచు మనోజ్ ముఖ్యభూమిక పోషించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబందం ప్రచారాన్ని ముమ్మరం చేసింది. తాజాగా ఇందులోని ట్రైన్ సీక్వెన్స్‌ను వివరిస్తూ ఓ బీటీఎస్ వీడియో విడుదల చేసింది. ఈ సీక్వెన్స్ సినిమాలో పెద్ద ఛాలెంజ్ అని.. కథను మలుపుతిప్పే సన్నివేశం అని టీమ్ పేర్కొంది. తేజ రిస్క్ చేసి ఇందులో నటించారని చిత్రబృందం తెలిపింది. ఇదిలావుంటే తన చిన్నప్పుడు మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటించినా.. మరోసారి ఆయనతో సినిమా చేయాలనుందని నటుడు తేజ సజ్జా తెలిపారు. అవకాశం వస్తే చిరుతో మల్టీస్టారర్ మూవీ చేస్తానన్నారు. తేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రం 'మిరాయ్' చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తేజ సమాధానమిచ్చారు.





# మెగాస్టార్‌ను కలుసుకున్న పూరిసేతుపతి బృందం

అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా ప్రాజెక్ట్ 'పూరి సేతుపతి'. విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌లో టబు హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటు-ండగా.. తాజాగా ఈ చిత్రయూనిట్ మెగాస్టార్ చిరంజీవిని కలుసుకుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం అనిల్ రావిపూడితో కలిసి మన శంకరవరప్రసాద్ గారు అనే సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతుండగా.. ఈ సినిమా పక్కనే షూటింగ్ జరుపుకుంటు-న్న 'పూరి సేతుపతి' టీ-మ్ చిరుని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోను చిత్రబృందం ఎక్స్ వేదికగా పంచుకుంది. ఇందులో నటు-లు చిరంజీవితో పాటు- విజయ్ సేతుపతి, టబు, నయనతార, ఛార్మీ తదితరులు ఉన్నారు.



# కిష్కిందపురి నచ్చకుంటే చిత్రసీమ వదిలేస్తా

## హీరో బెల్లంకొండ శ్రీనివాస్ గట్టి నమ్మకం




బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా వస్తున్న చిత్రం కిష్కింధపురి. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. షైన్ స్కీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ జానర్ లో వస్తున్న ఈ సినిమా -ట్రైలర్ కు మంచి స్పందన లభించింది. భైరవం తర్వాత వస్తున్న ఈ సినిమాపై బెల్లం కొండ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. ఈ నెల 12న ఈ సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది. కాగా ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో బెల్లం కొండా మాట్లాడుతూ ' సినిమా అంటే రెండున్నర గంటలు ఆడియెన్స్ ని ఎంట్టంల్గ÷న్ చేయడం. థియేటర్ లో కూర్చున్నపుడు ప్రేక్షకుడు బోర్ ఫిల్ అయి మొబైల్ చూడకుంటే ఆ సినిమా హిట్. నేను కాన్ఫిడెంట్ గా చెప్తున్న కిష్కిందపురి సినిమా స్టార్ట్ అయిన పది నిమిషాల తర్వాత ఆడియెన్స్ ఫోన్ చూడరు. ఒకవేళ అలా ఎవరైనా చూస్తే నేను అసలు ఇంకా సినిమాలు చేయను ఇండస్ట్రీ వదిలి వెళ్తాను. ఈ సినిమా అంత బాగుంటు-ంది. ఇది నేను ఛాలెంజ్ చేసి చెప్తున్నా. ఈ సినిమా కథపై నమ్మకంతో చెప్తున్న. కథ పరంగా, సౌండింగ్ పరంగా ఈ సినిమా చాలా బాగుంటుంది. ఆ నమ్మకంతో చెప్తున్న కిష్కింధపురి మిమ్మల్ని తప్పకుండా ఆకట్టుకుంటుంది' అని అన్నారు. బెల్లం కొండా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి బెల్లం స్టార్ మాటలు ఎంతవరకు నిజమవుతాయో రెండు రోజుల్లో తెలుస్తుంది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685